

ఉక్కులో 250 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

- రోజుకు కొంతమందిని తొలగించేందుకు యాజమాన్యం నిర్ణయం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటులో శుక్రవారం సుమారు 250 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించినట్టు తెలిసింది. వారి బయోమెట్రిక్‌ను యాజమాన్యం క్యాన్సిల్ చేసింది. దీంతో శనివారం నుంచి విధులకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. కాంట్రాక్టు కార్మికులను ఎలా తొలగిస్తారని ఉన్నతాధికారులను కార్మిక నాయకులు అడిగితే తమకు ఏమి తెలియదని సమాధానం ఇచ్చారు. కార్మికుల్లో 30 శాతం మేర తగ్గించాలని కాంట్రాక్టర్‌లకు మూడు రోజుల క్రితం యాజమాన్యం సూచించింది. అయితే కాంట్రాక్టర్‌లు మాత్రం తాము కార్మికులను తొలగించబోమని, ఏ నిర్ణయమైనా ప్లాంటు యాజమాన్యమే తీసుకోవాలని చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 250 మంది కాంట్రాక్టు కార్మికుల బయోమెట్రిక్‌ను నిలిపివేసినట్టు సమాచారం. ఒక్కసారే కాకుండా రోజుకు కొంతమందిని తొలగించాలని యాజమాన్యం భావిస్తున్నట్టు తెలిసింది.

ఉక్కు ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సలీమ్ పురుషోత్తమన్

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్-విశాఖ ఉక్కు కర్మాగారం) ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సలీమ్ జి పురుషోత్తమన్‌ను కేబినెట్ నియామకాల కమిటీ నియమించింది.ఆయన ప్రస్తుతం బ్రైత్ వైట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. సలీమ్ 2026 మే 31 వరకూ ఆర్‌ఐఎన్‌ఎల్‌లో డైరెక్టర్ విధులు నిర్వహిస్తారు.



సలీమ్ జి పురుషోత్తమన్

సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగడమే..

అత్యంత క్లిష్టం మహిళల జీవన యానం

- ఏ మహిళ జీవితమూ కనిపిస్తున్నంత సులభంగా ఉండదు
- వృత్తిపరమైన సవాళ్లతోపాటు ఆరోగ్యపరమైన ఇబ్బందులూ ఎక్కువే

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): "పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారంటే దాని వెనుక ఎంతో శ్రమ దాగి ఉంటుంది. ఏ మహిళ జీవితమూ కనిపిస్తున్నంత సులభంగా ఉండదు. కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూ, వృత్తిగత జీవితంలోనూ ఉన్నత స్థానాలను అధిరోహించడం సాధారణ విషయం కాదు." అని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి పేర్కొన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆమె కొద్దిరోజుల కిందట బాధ్యతలను చేపట్టారు. శనివారం (మార్చి 8వ తేదీ) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సంధ్యాదేవిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా మహిళలకు సంబంధించిన అనేక అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...



ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

- కుటుంబం నుంచి సపోర్ట్ అత్యంత కీలకం
- దురదృష్టవశాత్తూ అటువంటి భరోసా చాలామందికి దక్కడం లేదు
- సమస్యలతో డిప్రెషన్ బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది
- కుటుంబ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో మహిళ పాత్ర ఎంతో కీలకం
- ఆరోగ్యంపై మహిళలు అసలు అశ్రద్ధ చేయకూడదు
- 'ఆంధ్రజ్యోతి'తో ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి

ఎమోషనల్ సపోర్ట్ అవసరం

మహిళలు వృత్తిపరమైన వ్యవహారాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూనే మరోవైపు భార్యగా, తల్లిగా, కోడలిగా, అత్తగా అనేక పాత్రలను పోషించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ముఖ్యంగా వివాహం, పిల్లలు పుట్టిన తరువాత తీవ్రమైన ఒత్తిడి, యాంగ్జయిటీ వంటి సమస్యలు వేధిస్తుంటాయి. వాటిని బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగడం సాధారణ విషయం కాదు. ఈ క్రమంలో కుటుంబం నుంచి ఎమోషనల్ సపోర్ట్ అత్యంత కీలకం. అప్పుడే వృత్తి, వ్యక్తిగత ... మిగతా 6వ పేజీలో

అన్నింటినీ సమర్థంగా ఎదుర్కోవాలి

మహిళలు వృత్తిగతంగా, వ్యక్తిగతంగా అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటుంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకూ అనేక సవాళ్లు ఎదురవుతుంటాయి. అన్నింటినీ ఎదుర్కొంటూ ముందుకు వెళ్లినప్పుడే విజయాలను సాధించగలం. విభిన్నమైన పాత్రలను పోషించే మహిళ...లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకోవడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. శారీరకంగా, మానసికంగా బలంగా ఉండడం అత్యంత కీలకం. అప్పుడే మరింత సమర్థంగా పని చేసేందుకు అవకాశం ఉంటుంది.



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సేవా మార్గదర్శి!

- కెరీర్‌ను పక్కనపెట్టి.. సేవా మార్గం ఎంచుకుని మహిళల అభివృద్ధికి కృషిచేస్తున్న ఊహా మహంతి
- రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా కార్యక్రమాలు

8వ పేజీలో

ఉపాధి కల్పవల్లి

- జూట్‌బ్యాగ్‌ల తయారీతో మహిళలకు ఆసరా
- రూ.10వేల పెట్టుబడితో ఏడాదికి కోటి టర్నోవర్



సొంత ఆలోచనలకు అనుగుణంగా ఎదగాలి

ఎంతో కష్టపడి నిరూపించుకుంటే తప్ప మహిళలకు గౌరవం లభించదు

- ఒకరికొకరు సహకరించుకోవడం చాలా అవసరం
- అప్పుడే సాధికారత సాధ్యం
- జీసీసీ వైస్ చైర్‌పర్సన్, ఎండీ కల్పనాకుమారి



కల్పనా కుమారి

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): "ఇంట్లోనే ఉండాలి. వంటే చేయాలి. మగవారే సంపాదించాలి..అనే ధోరణి సరి కాదు. ఇలాంటి ఆలోచనల నుంచి మహిళలు బయటకు రావాలి. వాస్తవానికి ఈనాటి మగవాళ్లు కూడా మహిళలు అలా ఉండాలని కోరుకోవడం లేదు. ఇవన్నీ పూర్వ కాలం జరిగిన మాట వాస్తవమే. కానీ సమాజం మారింది. ఆ విషయం గుర్తించి మహిళలు సొంత ఆలోచనలకు అనుగుణంగా ఎదగడానికి యత్నించాలి." అని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి అన్నారు. అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ సాధించిన ఆమెను 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా కలవగా అనేక ఆలోచనలు పంచుకున్నారు. ఏమన్నారంటే...

సమానత్వం, విద్య చాలా ముఖ్యం

ఈ తరం యువతకు ఎన్నో కలలు, ఆశయాలు, అభిరుచులు ఉన్నాయి. అయితే అనేక అనుమానాలు వారిని వెనక్కి లాగుతాయి. సమాజం సహకరిస్తుందో? లేదో? అనే తెలియని భయం ఉంటుంది. నేనూ అలాగే ఫీల్ అయ్యాను. అదృష్టవశాత్తూ నాకు కుటుంబం వెన్నంటి ఉంది. పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు ఉన్నాయని, చదువుకుంటే జీవితంలో ఏదైనాసాధించవచ్చునని మా కుటుంబం బోధించింది. అందరికీ ఇలా ఉండదు. అనుకున్నది సాధించాలంటే...లక్ష్యంపైనే గురిపెట్టాలి. ఇంకేమీ పట్టించుకోకూడదు. ఎంతో కష్టపడి నిరూపించుకుంటే తప్ప మహిళలకు గౌరవం లభించదు. ఆ విషయం ప్రధానంగా దృష్టిలో ఉంచుకోవాలి. మహిళలు ఒకరికి మరొకరు సహకరించుకోవడం చాలా అవసరం. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. ఈ ప్రపంచం ప్రతి ఒక్కరిని జడ్జి (ఫలానా వ్యక్తిత్వం అని విశ్లేషించడం) చేస్తుంది. వాటన్నింటికీ అతీతంగా ముందుకుసాగాలి. ప్రతి ఒక్కరూ వారిలో అంతర్ శక్తిని గుర్తించి ఆ రంగంలో అడుగిడితే సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది.

బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చా

నేను 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యా. ఢిల్లీ మా స్వస్థలం. నాన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేసేవారు. అమ్మ గృహిణి. ఓ అక్క ఉంది. ఢిల్లీలోకి కేంద్రీయ విద్యాలయం ప్రాథమిక విద్యాభ్యాసం చేశాను. ఆ తరువాత కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశా. ఆ తరువాత ఎంఏ ఫిలాసఫీ చేశాను. సైకాలజీపై ఆసక్తితో ఇప్పుడు ఆంధ్రా యూనివర్సిటీలో అది కూడా చదువుతున్నాను. చదువు పూర్తయిన తరువాత ప్రభుత్వ రంగ బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. సివిల్స్ రాయాలనే సంకల్పంతో ఉద్యోగానికి రాజీనామా చేసేశాను. కష్టపడి చదివాను. విజయం సాధించాను. ఈ విజయం సాధించడంలో నా కుటుంబం, స్నేహితుల పాత్ర ... మిగతా 6వ పేజీలో

టీచర్ల సీనియారిటీ జాబితాలో తప్పులు

జడ్పీ మేనేజ్‌మెంట్‌లోకి వచ్చిన ఎయిడెడ్ టీచర్ల పేర్లు గల్లంతు



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న పైడిరాజు

- రోస్టర్ కమ్ మెరిట్ జాబితాలకు భిన్నంగా సీనియారిటీ ఖరారు
- సీనియర్ల కంటే ముందు జూనియర్ల పేర్లు
- డీఈవో కార్యాలయంలో ఒక ఉద్యోగి తీరుతోనే ఇబ్బందులు
- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో బదిలీలు, పదోన్నతుల కోసం పాఠశాల విద్యా శాఖ తయారుచేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో తప్పులు దొర్లాయి. ఈ జాబితాలో జడ్పీ యాజమాన్యం పరిధిలోకి వచ్చే ఎయిడెడ్ ఉపాధ్యాయుల పేర్లు కనిపించడం లేదు. అదేవిధంగా సీనియర్ల కంటే జూనియర్ల పేర్లు ముందుండడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. కీలకమైన రోస్టర్ కమ్ మెరిట్ జాబితాకు భిన్నంగా దీనిని రూపొందించారని టీచర్లు మండిపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మునిసిపాలిటీ, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 15 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. సర్వీస్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలి. అయితే ఈ విషయంలో ప్రతిసారి తప్పులు జరగడం, టీచర్లు ఆందోళన చేయడం పరిపాటిగా మారింది. అటువంటి గందరగోళాలకు తావులేకుండా అన్ని యాజమాన్యాల పరిధిలో కేడర్ వారీగా సీనియారిటీ జాబితాలు తయారుచేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారమే వచ్చే నెలలో పదోన్నతులు, బదిలీలు చేపడతామని, భవిష్యత్తులో ఇవ్వబోయే పదోన్నతులు ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ జిల్లాల వారీగా జాబితాలు రూపొందించింది. జిల్లాల విభజన జరిగినా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగానే సీనియారిటీ జాబితా తయారుచేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా జాబితా తయారీలో తప్పులు దొర్లాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎయిడెడ్ పాఠశాలలను బలవంతంగా మూసివేసి అక్కడి టీచర్లను జడ్పీ/మునిసిపల్ పాఠశాలలకు బదిలీ చేశారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి జడ్పీ/మునిసిపల్ పాఠశాలలకు వచ్చేంత వరకు వీరి సర్వీస్ ... మిగతా 6వ పేజీలో



కైలాసగిరి రోప్‌వే వద్ద దట్టంగా కమ్ముకున్న పొగలు

కైలాసగిరిపై కలకలం

- దట్టమైన పొగలు రావడంతో ఏం జరిగిందోనని ఆందోళన
- చెత్తకుప్పకు నిప్పు పెడితే పక్కనున్న పాత టైర్లకు అంటుకున్న మంటలు

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై శుక్రవారం ఉదయం దట్టమైన నల్లని పొగలు అలుముకున్నాయి. అగ్నిమాపక శకటం వెళ్లి మంటలను అదుపు చేసింది. ఆ తరువాత వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోప్‌వే ఆగేచోట ఎండుటాకులు కుప్పగా ఉండడంతో అక్కడి సిబ్బంది వాటికి మంట పెట్టి విధుల్లోకి వెళ్లిపోయారు. ఆ మంటలు పక్కనున్న పాత టైర్లకు అంటుకోవడంతో దట్టమైన పొగలు పైకి ఎగిశాయి. రోప్‌వేలో చక్రాలకు ఉపయోగించే టైర్లు అరిగిపోయాక పక్కన పడేస్తుంటారు. చెత్తకుప్ప పక్కనే అవి ఉండడంతో అంటుకుని మంటలు పెద్దవయ్యాయి. ఈ విషయం గుర్తించి రోప్ వే కాంట్రాక్టర్‌ను కమిషనర్ మందలించారు. ఇచ్చిన స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, మళ్లీ మంటలు పెడితే ఉపేక్షించబోమని, దీనికి కారణమైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ తరువాత ఆయన కైలాసగిరి మొత్తం తిరిగి అవసరమైనచోట్ల ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి నష్టం జరగలేదని వెల్లడించారు.వీఎంఆర్‌డీఏ సెక్రటరీ మురళీకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు కూడా ఘటనా స్థలాన్ని సందర్శించారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అధికారులకు ఆదేశించారు.

దాసు ఔట్

జిల్లా పర్యాటక శాఖ అధికారి (డీటీవో) పోస్టు నుంచి తప్పించిన కలెక్టర్

- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి నిధులు డ్రా చేసే అధికారం లేనందునే...
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్‌కు బాధ్యతలు అప్పగింత



గరికిన దాసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖలో జరుగుతున్న కుర్చీలాటకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ చెక్ పెట్టారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అయినా గరికిన దాసును జిల్లా పర్యాటక శాఖ అధికారి (డీటీఓ) పోస్టు నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీచేశారు. పర్యాటక శాఖలో అధికారులు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటూ సంస్థ పరువును రోడ్డుకు ఈడ్చిన సంగతి తెలిసిందే. రుషికొండ బీచ్‌లో అదనపు ఆదాయం కోసం వర్గాలుగా విడిపోయి నిర్వహణను గాలికి వదిలేయడంలో బ్లూ ఫ్లాగ్ గుర్తింపు తాత్కాలికంగా రద్దయింది. దీంతో ప్రభుత్వం విశాఖ డీటీఓగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణిని మాతృ శాఖకు పంపించేసింది. అలాగే ఈఈ రమణను అదనపు బాధ్యతలుగా నిర్వహిస్తున్న ఆర్‌డీ పోస్టు నుంచి తప్పించింది. డివిజనల్ మేనేజర్ జగదీశ్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. అయితే ఏపీ పర్యాటక సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరి మేనేజర్‌గా పదోన్నతి పొంది విజయనగరం జిల్లా బాధ్యతలు చూస్తున్న గరికిన దాసును విశాఖ డీటీఓగా నియమిస్తూ ఏపీ పర్యాటక సంస్థ సీఈఓ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీచేశారు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాను అదనపు బాధ్యతలుగా అప్పగించారు. గరికిన దాసు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అని, విశాఖ వంటి కీలకమైన జిల్లాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగితో పర్యాటక శాఖను నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తగదని పేర్కొంటూ 'కాంట్రాక్టు ఉద్యోగికి పర్యాటక పగ్గాలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' బుధవారం కథనం ప్రచురించింది. దానిపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ విచారణ చేయించారు. పర్యాటక సంస్థలో నిధులు డ్రా చేయడానికి, ఖర్చు చేయడానికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి అధికారం లేనందున గరికిన దాసును ఆ పోస్టు నుంచి తప్పిస్తూ గురువారం ... మిగతా 6వ పేజీలో

15 నుంచి ఒంటిపూట బడులు


భీమునిపట్నం (రూరల్) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎండలు పెరుగుతున్నందున ఈనెల 15 నుంచి ప్రభుత్వ పాఠశాలలను ఒంటి పూట నిర్వహిస్తారు. ఈ మేరకు విద్యా శాఖ ఉత్తర్వులు జారీచేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.ప్రేమ్‌కుమార్ శుక్రవారం పాఠశాలకు సమాచారాన్ని అందించారు. ఉదయం ఏడున్నర నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలలను నిర్వహిస్తారు. మధ్యాహ్నం 11.30 గంటలకు భోజనం పెట్టి విద్యార్థులకు ఇళ్లకు పంపిస్తారని అన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.08
సహరి (ఆది)	4.53

టీడీఆర్‌ల జారీలో అవకతవకలు

- మాజీ ఎంపీ ఎంవీవీకి అడ్డగోలుగా రూ.60 కోట్ల బాండ్
- అసెంబ్లీలో నగర ఎమ్మెల్యేల ప్రస్తావన
- విచారణకు ఆదేశించామన్న మునిసిపల్ మంత్రి నారాయణ



విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా టీడీఆర్‌లు తీసుకుని ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టాన్ని కలిగించారని తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు. శుక్రవారం అసెంబ్లీలో టీడీఆర్‌ల జారీపై జరిగిన చర్చలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు వెలగపూడి, పల్లా శ్రీనివాసరావు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజులు పాల్గొన్నారు. సిరిపురం జంక్షన్‌లో సీబీసీఎన్‌సీ స్థలంలో జీపీ హోల్డర్‌కు టీడీఆర్ ఎలా ఇచ్చారని ఈ సందర్భంగా వెలగపూడి ప్రశ్నించారు. రోడ్డు విస్తరణలో ఆ స్థలంలో కొంత భూమి పోతుందని పేర్కొంటూ రూ. 60 కోట్ల విలువైన టీడీఆర్‌లు తీసుకున్నారన్నారు. కాకినాడలో టీడీఆర్ జారీ వ్యవహారంలో తహసీల్దార్‌ను సస్పెండ్ చేశారని, అదేవిధంగా సీబీసీఎన్‌సీ భూముల్లో అక్రమాలు జరిగాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ పెద్దలకు భారీగా సొమ్ములు ముట్టజెప్పిన తరువాతే సీబీసీఎన్‌సీ స్థలంలో భవన నిర్మాణానికి అనుమతులు, టీడీఆర్‌లు జారీ అయ్యాయన్నారు. దీనిపై మునిసిపల్ మంత్రి నారాయణ స్పందిస్తూ టీడీఆర్‌ల జారీపై విచారణకు ఆదేశించామన్నారు.

రాజీవ్ స్వగృహ స్థలం వెనక్కి తీసుకోవాలి.

ఎండాడలో రాజీవ్ స్వగృహకు కేటాయించిన స్థలాలను తిరిగి వెనక్కి తీసుకుని ప్రభుత్వమే వినియోగించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలకు 2007లో 47 ఎకరాలు కేటాయించగా, ... మిగతా 6వ పేజీలో

ఘనంగా ఎల్లమ్మ జాతర



భీమునిపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి రెల్లివీధిలో ఎల్లమ్మ జాతరను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ఆలయ ప్రత్యేక పూజలు చేశాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో విశాఖకు వెళ్లే రోడ్డు రద్దీగా మారడంతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి అనుపోత్సవాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు వి.ఆనంద్, సత్యనారాయణమూర్తి, కుమార్, నాని, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

చిల్లపేటలో దర్శనాలు ప్రారంభం

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని చిల్లపేట, జీరుపేటల మధ్య నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పద్మనాభం పంచాయతీ పరిధి అర్చకుని పాలెంలో శనివారం బంగారమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరపడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన చేపడతామన్నారు.

'ఔషధ పరిశోధనల్లో సవాళ్లను ఎదుర్కొనాలి'

సాగర్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా సరికొత్త ఆరోగ్య సంబంధిత సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో వైద్య రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని, వీటిని ఔషధ పరిశోధనల ద్వారా ధీటుగా ఎదుర్కోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫార్మసీ రంగంలో నూతన పోకడలు అనే జాతీయ సదస్సులోఏ ఆయన మాట్లాడారు. ఔషధ రంగంలో మన దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. సీడీఎస్‌సీవో అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ కె.భువనేశ్వరి మాట్లాడుతూ దేశంలో దాదాపు 10వేల ఔషధ ఉత్పత్తి పరిశ్రమలు ఉన్నాయని, ఔషధాల ఎగుమతిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందన్నారు.

ఉత్తమ నియోజకవర్గంగా భీమిలిని తీర్చిదిద్దుతా

» అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ సిద్ధం

» అన్న క్యాంటీన్లలో ఆహారం రుచిగా ఉండాలని నిర్వాహకులకు ఆదేశించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు





ఐదో వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గంటా శ్రీనివాసరావు. (ఇన్‌సెట్లో) అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

కొమ్మాది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భీమిలిని రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశామన్నారు. శుక్రవారం జీవీఎంసీ 5వ వార్డులోని పరదేశిపాలెం, వికలాంగుల కాలనీలో సుమారు రూ.3.60 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ నాలుగు వార్డుల్లో మొత్తం రూ.108 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. మధురవాడ ప్రాంతం మరో మణికొండ, హైటెక్ సిటీ, గచ్చిబౌలిలా రూపురేఖలు మార్చుకోనున్నదని ఆయన పేర్కొన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణపై ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్వహణలో లోపాలను సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఇకపై తరచూ అన్న క్యాంటీన్లను సందర్శించి ఆహార నాణ్యత విషయంలో తేడా లేకుండా చూస్తామన్నారు. కార్పొరేటర్ హేమలత మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ఎమ్మెల్యే గంటాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకటరావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి వెంకటరమణ, నాగోతి సత్యనారాయణ, దేవర శివ, ఎం.సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన గంటా

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు పరిధి వాంబే కాలనీలో ఉన్న అన్న క్యాంటీన్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో నాణ్యత లేని అల్పాహారం, భోజనం పెడుతున్నారని కార్పొరేటర్ పిళ్లా మంగమ్మకు పలువురు ఫిర్యాదు చేయడంతో ఆమె ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆయన అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, భోజనం చేశారు. ఆహారం రుచికరంగా ఉండాలని, కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించడానికి కారణం పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనం అందించడానికేనన్నారు. ఇకపై అల్పాహారంతో పాటు భోజనం రుచికరంగా అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

మహిళా చట్టాల పట్ల అవగాహనే కీలకం

» ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.విజయలక్ష్మి



జస్టిస్ విజయలక్ష్మికి జ్ఞాపిక అందజేసి సత్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

సాగర్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహిళల సంరక్షణకు ఎన్ని చట్టాలున్నా వాటి పట్ల అవగాహన, అమలు చేసే విధానమే కీలకమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.విజయలక్ష్మి అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాల యం మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంత ర్జాతీయ మహిళాదినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పడంతో పాటు సమాన అవకాశాలను కల్పించాలని పేర్కొందన్నారు. సమాన విద్య, ఉపాధి అవకాశాలను కల్పించాల్సి ఉంటుందని, వీటిని పరిరక్షించుకోవడంతో పాటు న్యాయం కోసం బాధితుల తరఫున పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలోని కార్పొరేట్ రంగంలో నాయకత్వ స్థానాల్లో కేవలం 15 శాతం మంది మాత్రమే మహిళలు ఉంటున్నారని, వారిని మరింతగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఆయా సంస్థలపై ఉందని పేర్కొన్నారు. గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ మహిళలు మానసికంగా బలమైన పోరాట దృక్పథాన్ని కలిగివుండాలని అప్పుడే అన్ని రంగాలలో విజయం సాధించవచ్చన్నారు. మన దేశంలో లింగ వివక్ష ఇంకా ఉనికిని చాటుకుంటుందని, దీనిని మార్చాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ డిసౌజా, జిమ్‌సర్ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం మహిళాసాధికారిక అధ్యక్షురాలు డాక్టర్ వీబీ శ్రీవిద్య, కన్వీనర్ సుధా రాజగోపాలన్, తదితరులు పాల్గొన్నారు. అంతనం విశ్రాంత జస్టిస్ కె.విజయలక్ష్మిని శ్రీభరత్ ఘనంగా సత్కరించారు.

'వైసీపీ హయాంలోనే అర్హులకు సంక్షేమ పథకాలు'

మధురవాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ హయాంలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీను అన్నారు. 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలోని ఒక కల్యాణ మండపంలో వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని కార్యకర్తలందరినీ ఏకతాటిపైకి తెచ్చి వైసీపీకి పూర్వ వైభవం తెస్తానన్నారు. త్వరలో అన్ని ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు. వైసీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో తిరువీధి ఉత్సవం

సింహాచలం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి సన్నిధిలో అమ్మవార్ల తిరువీధి ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సింహవల్లీ తాయార్ అమ్మవారి సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చన జరిపారు. సాయంత్రం సింహవల్లీ తాయార్, చతుర్భుజి అమ్మవార్లను ప్రత్యేక పల్లకిలో ఉంచి ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, వేదమంత్రాల నడుమ బేడామండప తిరువీధి జరిపారు. మార్గంలో అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలిచ్చారు.

కమ్యూనికేషన్ రంగంలో విస్తృత అవకాశాలు



జ్ఞాపిక అందిస్తున్న దూరదర్శన్ మాజీ డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఎం.వి.డాక్టర్ డి.రంగనాథమ్

సాగర్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టెలీకమ్యూనికేషన్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఇంజనీరింగ్ విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని, ముఖ్యంగా సాంకేతిక ప్రగతిలో స్వదేశీ పరిజ్ఞానం కీలక పాత్ర పోషించనుందని దూరదర్శన్ మాజీ డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఎం.వి.డాక్టర్ డి.రంగనాథమ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఈఈసీఈ విభాగం, బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ సొసైటీ (ఇండియా) హైదరాబాద్ చాప్టర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఛేంజింగ్ ఫేస్ ఆఫ్ బ్రాడ్‌కాస్ట్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లో శుక్రవారం ఆయన ప్రసంగించారు. స్వదేశీ పరిజ్ఞానంతో 5జి టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఘనత భారతీయ పరిశోధకులదేనని, 6జి టెక్నాలజీ కోసం కూడా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. టెలికామ్ రంగం 25 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తుందని, అందుకు తగ్గట్లుగా విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్‌లో వస్తున్న మార్పులను యువత నిశితంగా గమనిస్తూ, పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రం డిప్యూటీ డైరక్టర్ జనరల్ సి.సుబ్బారావు మాట్లాడుతూ కృత్రిమ మేధను విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ సొసైటీ (ఇండియా) నిపుణులు ఎల్.శ్రీపతిరావు, డాక్టర్ వి.రామారావు పాల్గొన్నారు.

పాఠశాలలు 220 రోజులు పనిచేయాల్సిందే: డీఈవో

భీమునిపట్నం (రూరల్) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ 23తో ముగిసే ఈ విద్యా సంవత్సరంలో 220 రోజులు పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.పేమ్‌కుమార్ తెలిపారు. కొన్ని పాఠశాలలు తమకు అనుకూలంగా సెలవులు ఇస్తున్నాయని, అందువల్ల కొన్ని పాఠశాలలకు పనిదినాలు సరిపోవడం లేదని పేర్కొన్నారు. అందువల్ల అదనపు పనిదినాలు పని చేయవలసి ఉంటుందని డీఈవో అన్నారు.

పారదర్శకంగా రీసర్వే చేపట్టండి

» రైతులతో కలెక్టర్ మాటామంతీ » గొట్టిపల్లి గ్రామ సచివాలయం, పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ




గొట్టిపల్లిలో రైతులతో సంభాషిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆనందపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గొట్టిపల్లిలో జరుగుతున్న రీ-సర్వే, ఈ-పంట ప్రక్రియను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం పరిశీలించి అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. డ్రోన్, రోవర్ ద్వారా రీసర్వే జరిగిన తీరును పరిశీలించారు. సర్వే పూర్తయ్యాక గ్రామసభ నిర్వహించి, పూర్తి వివరాలను రైతుల ముందుంచాలని అధికారులను ఆదేశించారు. రైతుల వినతులను పరిశీలించి వెంటనే సంతృప్తికరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ కాసేపు సంభాషించారు. రీ-సర్వే, ఇతర సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. గొట్టిపల్లి సచివాలయాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించిన ఆయన సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఉద్బోధించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట సర్వే విభాగం ఏడీ సూర్యారావు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీవో జానకి, వివిధ శాఖల అధికారులు, స్థానిక రైతులు ఉన్నారు.

రామాయణం అజరామరం

బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనాల ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామాయణం అత్యంత అర్థం, శక్తిమంతం, ప్రయోజనకరమైన కావ్యమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం రామాయణం భూమిపై ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. కొమ్మాది గాయత్రీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 42 రోజులుగా జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రసంగించారు. శ్రీరామకథ మధురాతి మధురమైనదని రామాయణాన్ని చదివినా, విన్నా, చెప్పినా దేవతలు, పితృదేవతలు సంతోషిస్తారన్నారు. రామాయణం గొప్పతనాన్ని ఆయన వివరించారు. ప్రవచనాలకు విశేషసంఖ్యలో ఔత్సాహికులు హాజరయ్యారు.

చెరువు గర్భాన్ని పూడ్చివేస్తూ రహదారి నిర్మాణం

» తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన చేపలుప్పాడ గ్రామస్థులు



రహదారిని నిర్మిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపలుప్పాడ శివారున పండావాని చెరువును ఓ రియల్ ఎస్టేట్స్ సంస్థ నిర్వాహకులు గ్రావెల్‌తో పూడ్చివేస్తూ రహదారిని నిర్మిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ రామారావుకు గ్రామ పెద్దలు కారి రాంబాబు, కారి అప్పారావు, చీపుళ్ల శ్రీనివాసరావు, తదితరులు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చేపలుప్పాడ శివారున ఉన్న విల్లాలకు సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ లేఅవుట్ వేస్తుందన్నారు. ఈ విల్లాలకు సమీపంలో సర్వే నంబర్ 3/3లో 1.68 సెంట్లలో ప్రభుత్వానికి చెందిన పండా వాని చెరువు ఉందన్నారు. ఈ చెరువు ఒడ్డు నుంచి ఆ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు గత ఏడాది ఫిబ్రవరిలో రోడ్డును నిర్మించడానికి యత్నించగా అప్పట్లో గ్రామస్థుల ఫిర్యాదుతో పనులను నిలిపివేశారన్నారు.

అయితే గురువారం రాత్రి నుంచి మళ్లీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారని పేర్కొన్నారు. ఈ రహదారి మీదుగానే సదరు లేఅవుట్‌లోనికి వాహనాల రాకపోకలు సాగుతున్నాయన్నారు. ఈ చెరువు దురాక్రమణ జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. దీనిపై తహసీల్దార్ రామారావు బదులిస్తూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏఆర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అనకాపల్లి ఎస్పీ

సాగర్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాల రికార్డులు ,ఆయుధాల నిర్వహణ, వాహనాల పనితీరు ,శిక్షణ ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లు, తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని విభాగాలలో పనితీరు, భద్రతా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

దాసు ఔట్

... 5వ పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు హెచ్‌పీసీఎల్‌లో భూ సేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సనపల సుధాసాగర్‌ను డీటీఓగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడితో ఆ శాఖలో వివాదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని అంతా భావిస్తున్నారు. ఆర్డీగా కూడా పూర్తిస్థాయి అధికారిని నియమిస్తే ప్రభుత్వం అనుకున్నట్టుగా జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులు ఊపందుకునే అవకాశం ఉంది.

సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగడమే

... 5వ పేజీ తరువాయి

జీవితం సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుంది. కానీ, అనేక కుటుంబాల్లో ఈ భరోసా మహిళలకు దక్కడం లేదు. ఎంతోమంది మహిళలు జీవన ప్రయాణాన్ని అత్యంత క్లిష్టంగా ముందుకు సాగించాల్సిన స్థితిలో ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులే కాకుండా కుటుంబపరమైన అవరోధాలు వారిని మరింత కుంగుబాటుకు గురిచేస్తున్నాయి. ఈ విషయంలో భిన్నమైన ఆలోచనలను కుటుంబ సభ్యులు కలిగి ఉండడం దురదృష్టకరం. కుటుంబ సభ్యుల సహకారం ఉంటేనే సవాళ్ల ప్రయాణం సాఫీగా సాగుతుంది.

మహిళలను వేధించే ఇబ్బందులు ఎన్నో..

పురుషులతో పోలిస్తే మహిళలను వేధించే అనారోగ్య సమస్యలు ఎన్నో. ప్రతినెలా రుతుస్రావం వల్ల ఎంతోమంది తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతుంటారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపరమైన సమస్యలు, వృత్తిపరమైన ఒత్తిళ్ల కారణంగా డిప్రెషన్ బారినపడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. తీవ్రమైన ఒత్తిడి వల్ల ఇతర అనారోగ్య సమస్యలు కూడా వేధిస్తున్నాయి. ఇవి కుటుంబ ఆర్థిక, సామాజిక అభివృద్ధిని వెనక్కి లాగుతాయి.

జీవితాలు నాశనం చేసుకునేలా..

కుటుంబ సభ్యుల నుంచి దొరకని ప్రేమను బయట కోరుకునే క్రమంలో కొందరు తప్పటడుగులు వేస్తున్నారు. సామాజిక మాధ్యమాలు వినియోగం పెరిగిన తరువాత ఈ తరహా ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. అటువంటి వాటి విషయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలి. పరిధికి మించిన కోర్కెలు తప్పుడు మార్గాలవైపు వెళ్లేలా చేస్తున్నాయి. కాబట్టి, మహిళలు ఈ తరహా అట్రాక్షన్స్‌ను అదుపులో పెట్టుకుంటే జీవితం సాఫీగా ముందుకుసాగుతుంది.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు..

మహిళలు ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చూపిస్తుంటారు. ఏదైనా సమస్య వస్తే గానీ వైద్యుల వద్దకు వెళ్లరు. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దు. కొన్ని రకాల పరీక్షలను వయసును బట్టి ముందుగా చేయించుకోవాలి. సర్వైకల్ స్క్రీనింగ్, మమోగ్రఫీ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు అవకాశం ఉంది. పెళ్లికి ముందు అమ్మాయిలు తప్పనిసరిగా అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. దీనివల్ల గర్భం దాల్చిన తరువాత ఎదురయ్యే తీవ్రమైన అనారోగ్య సమస్యల ముప్పును తప్పించుకునేందుకు అవకాశం ఉంటుంది.

భరోసా ఏదీ.?

మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు, అనారోగ్య సమస్యలకు సంబంధించి కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన స్థాయిలో భరోసా లభించకపోవడం వారిని తీవ్రమైన కుంగుబాటుకు గురయ్యేలా చేస్తోంది. ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడు నేనున్నానన్న భరోసాను కల్పించినప్పుడు వారిలో కలిగే ఆనందం వేరు. ఆస్పత్రులకు మహిళలకు తోడుగా కుటుంబ సభ్యులు రావడం అరుదు. చాలామంది ఒంటరిగానే వస్తుంటారు. దీనివల్ల మహిళలు మానసికంగా మరింత కుంగుబాటుకు గురయ్యే అవకాశం ఉంది. మహిళ ఫిజికల్‌గా, మెంటల్‌గా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా ముందుకుసాగుతుంది.

వృత్తి జీవితం..

మాది తూర్పు గోదావరి జిల్లా అయినా నాన్న ఏయూలో ఫిజిక్ డిపార్టుమెంట్‌లో పనిచేయడంతో ఇక్కడే పుట్టి పెరిగా. పదో తరగతి వరకూ కొటాక్‌లో, ఇంటర్ సెయింట్ జోసఫ్‌లో చదువుకున్నా. 1986లో ఎంబీబీఎస్, హౌస్ సర్జన్ పూర్తిచేశాను. 1992లో ఆంధ్ర మెడికల్ కాలేజీలో గైనకాలజీలో పీజీ చేశాను. సాలూరులో తొలి సర్వీస్ ప్రారంభమైంది. అక్కడకు వెళ్లిన తొలి గైనకాలజీ వైద్యురాలిని నేనే. ఏజెన్సీ ప్రాంతాల్లోని మహిళలు ఇబ్బందులు అప్పుడే తనకు తెలిశాయి. ఆ తరువాత కేజీహెచ్ గైనకాలజీ విభాగంలో 1995 నుంచి 2013 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశాను. 2013లో నెల్లూరు ఆస్పత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా వెళ్లాను. 2018లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందాను. ఆ తరువాత 2023 నుంచి కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతిగా పని చేస్తున్నా. మార్చి ఒకటో తేదీన ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాను. తల్లిదండ్రులు, భర్త డాక్టర్ కేవీ రావు, కుమార్తె కృష్ణ మంజరి సహకారంతోనే వృత్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నా.

టీచర్ల సీనియారిటీ జాబితాలో తప్పులు

... 5వ పేజీ తరువాయి

వివరాలు సంబంధిత ఎయిడెడ్ యాజమాన్యం/డీఈవో కార్యాలయంలో ఉంటాయి. ఆ వివరాలకు జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసిన కాలాన్ని కలిపి సీనియారిటీ ఖరారు చేయాలి. కానీ ఆ విధంగా చేయకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు టీచర్లు డీఈవో దృష్టికి తీసుకువచ్చారు. సాధారణంగా ఉపాధ్యాయుల నియామక సమయంలోనే రోస్టర్ కమ్ మెరిట్ జాబితా రూపొందించి దాని ప్రకారమే ఉద్యోగాలు ఇస్తారు. ఆ ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలి. కానీ విద్యా శాఖలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 1994 నుంచి 2018 వరకూ జరిగిన డీఎస్సీలకు సంబంధించి మెరిట్ కమ్ రోస్టర్ జాబితాల ఆధారంగా ప్రస్తుతం సీనియారిటీ జాబితా తయారు చేయలేదని టీచర్లు మండిపడుతున్నారు.

జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఒక ఉద్యోగి (డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న టీచర్) నిర్వాకంతో మెరిట్ కమ్ రోస్టర్ జాబితాలు కొన్ని కనిపించడం లేదని, అందుబాటులో ఉన్న జాబితాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ విద్యా విభాగం నిర్వాకంతో నగరంలో మునిసిపల్ పాఠశాలల టీచర్ల సీనియారిటీ వివరాలు మొత్తం తప్పులతడకగా ఉన్నట్టు పలువురు టీచర్లు ఆరోపిస్తున్నారు. వాటిని ఒకటికి రెండుసార్లు పరిశీలించకుండా ఇప్పుడు జాబితా తయారు చేశారనే వాదన ఉంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సీనియారిటీ జాబితాలో జూనియర్ల పేర్లు ముందుండి తరువాత సీనియర్ల పేర్లు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను విశాఖ డీఈవో కార్యాలయంలో స్వీకరిస్తున్నారు. జిల్లాల విభజన జరిగినా అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి టీచర్లు విశాఖ రావాల్సి వస్తుండడంపై సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. కొత్త జిల్లాల వారీగా అభ్యంతరాలు స్వీకరించి అక్కడ నుంచి వాటిని విశాఖకు పంపాలని కోరుతున్నారు. సీనియారిటీ జాబితాపై టీచర్ల నుంచి అభ్యంతరాల స్వీకరణకు ఈనెల పదో తేదీ వరకూ ఇచ్చిన గడువును పెంచాలని కోరుతున్నారు. జాబితాలో తప్పులు సవరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిట్టిబాబు వేర్వేరుగా డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు.

టీడీఆర్‌ల జారీలో అవకతవకలు

... 5వ పేజీ తరువాయి

11,296 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రూ.ఐదు వేల వంతున చెల్లించారన్నారు. వారిలో 3,311 మందికే డబ్బులు తిరిగి ఇచ్చారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు గజం రూ.60 వేల ధర ఖరారుచేసి కొన్ని ప్లాట్లు అమ్మకానికి పెట్టగా వైసీపీ నాయకులంతా కుమ్మక్కై గజం రూ.60,500కు దక్కించుకున్నారని ఆరోపించారు. ఇంకా మిగిలిన ప్లాట్లు అమ్మకం కోసం అధికారులు ఇటీవల వరకూ యత్నించారని, ఈ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. భూముల విలువ పెరిగినందున వేలం రద్దు చేసి ప్రభుత్వ వినియోగానికి అనువుగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సొంత ఆలోచనలకు అనుగుణంగా ఎదగాలి

... 5వ పేజీ తరువాయి

ఎంతో ఉంది. వారికి సమానత్వంపై విశ్వాసం ఎక్కువ. వారి నుంచి లభిస్తున్న నిరంతర సహకారం వల్లనే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. నంద్యాలలో సబ్ కలెక్టర్‌గా, జిల్లా హౌసింగ్ అధికారిణిగా, సీతంపేట ఐటీడీఏ పీఓగా పనిచేశా. ఇప్పుడు జీసీసీలో ఉన్నా. విశాఖ ఏజెన్సీలో పండించే పసుపునకు కూడా ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకువచ్చి, ఇక్కడి రైతులకు మంచి గిట్టుబాటు ధర అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా.

నేడు మహిళా ఖైదీలకు మిఠాయిల పంపిణీ

ఆరిలోవ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళా ఖైదీలకు శనివారం మిఠాయిలు పంపిణీ చేస్తామని జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. పలు ఎన్జీవోలు వేడుకలు నిర్వహించేందుకు ముందుకువచ్చినా ప్రభుత్వం నుంచి అనుమతి లభించలేదన్నారు. ఈ నేపథ్యంలో జైలులోని 83 మంది ఖైదీలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు.

తూనికలో లోపాలుంటే కేసులు

ఎంవీపీ కాలనీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైతు బజారులో కూరగాయలు విక్రయించే రైతులు తమ కాటాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, లేదంటే కేసులు తప్పవని ఎంవీపీ కాలనీ రైతు బజారు ఎస్టేట్ అధికారి వరహాలు హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ కాటాలపై స్టాంపు గడువు పూర్తయితే వెంటనే పునరుద్ధరించుకోవాలని సూచించారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం చేపట్టిన తనిఖీల్లో ఐదుగురు రైతులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఎలక్ట్రానిక్ తూకంపై స్టాంపు గడువు అయిపోయినా, వినియోగించడంపైనా కేసులు నమోదు చేశారని, రైతులందరూ తూకాల్లో కచ్చితమైన కొలతలు ఉండేలా చూసుకోవాలన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


వానపల్లి శ్రీనివాస్

ఆరిలోవ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత నెల 28వ తేదీ నుంచి తన సోదరుడు కనిపించడం లేదంటూ ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలివి... గాంధీనగర్‌కు చెందిన వానపల్లి శ్రీనివాస్(35) గత నెల 28న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదని బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వాకబు చేసినా ఫలితం కనిపించలేదని అతని సోదరుడు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌కు మతిస్థిమితం లేదని, మానసిక దివ్యాంగుడని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94906 17918 నంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ మల్లేశ్వరరావు కోరారు.

రోజుకు 330 టన్నుల చెత్త సేకరణ

ఆరిలోవ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ డంపింగ్‌యార్డుకు ప్రతిరోజూ 330 టన్నుల చెత్త వస్తోందని సిబ్బంది తెలిపారు. ఈ చెత్తను జోన్ -2. జోన్-3, జోన్-5 నుంచి సేకరిస్తున్నారన్నారు. చెత్తను ఇక్కడ వేయింగ్ మెషీన్‌లో వేసి వివరాలు నమోదు చేస్తారన్నారు. ఇలా వచ్చిన చెత్తను సాయంత్రంలోగా కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంటుకు తరలిస్తారన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్:** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళదుంపలు 15, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 56, అల్లం 50, బరబాటి 32, ముల్లంగి 2, నిమ్మకాయలు (కిలో) 95, బద్దచిక్కుడు 44, దోస కాయలు 28, వెల్లుల్లి 115, కొబ్బరికాయ 25, బీన్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 56, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190


జీవీఎంసీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది


దుర్గాబాయ్ దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలి

- యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి
- జీవీఎంసీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించి, ఆర్థికంగా బలోపేతం కావాలని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం.సత్యవేణి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ సర్వీసెస్(జెమ్స్) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీలో మహిళా దినోత్సవం నిర్వహించిన జెమ్స్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినా వారికి అన్యాయం జరుగుతోందన్నారు. మహిళలలో చిన్నప్పటి నుంచే మనోధైర్యాన్ని నింపాలన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యుదయానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉద్యోగంతో పాటు ఇంటిని చక్కదిద్దే పని మహిళలు చేస్తారని వారి సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తూ, ఆర్థికంగా బలపడి, మనో ధైర్యంతో విధులు నిర్వహించాలన్నారు. భీమిలి జోనల్ కమిషనర్ పి.ప్రసన్నవాణి తన విద్యాభ్యాసాన్ని, ఉద్యోగ నిర్వహణలో అనుభవాల్ని పంచుకున్నారు. అనంతరం జెమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగంతో పాటు ఉద్యమాలలో, సామాజిక, సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఎస్‌ఏ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుబ్బలక్ష్మి, విశాఖ ప్రధాన కార్యదర్శి ఇ.అప్పలరాజు, జెమ్స్, వైస్‌ప్రెసిడెంట్ ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీలో శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు

యువత ఆలోచనలు ఉన్నతంగా ఉండాలి

వెంకోజీపాలెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): యువత ఆలోచనలు మంచి ఉద్దేశంతో ఉన్నతంగా సాగాలని నారీ శక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి అన్నారు. ఏయూ దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. మార్పు మన నుంచి ప్రారంభం కావాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలనే తపనతో సాగాలన్నారు. కలలను సాకారం చేసుకునే దిశలో గురువుల పాఠాలు ఉపయోగపడతాయన్నారు. ఆలోచనలో స్పష్టత, లక్ష్యం దిశగా నిరంతర శ్రమ అవసరమన్నారు. సమానత్వం, ఐకమత్యంతో మెలగడం, సోదర భావం కలిగి ఉండడం ప్రధానమని తెలిపారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతా మాణిక్యం మాట్లాడుతూ మహిళలు తమ సమర్థతను రుజువు చేసుకోవాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలతో ఉన్న వారికి చేయూతనివ్వడం, సహాయం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. స్త్రీలపై హింస తగ్గాలని, ఇతరుల నుంచి అసహజ ప్రవర్తన గుర్తిస్తే, వెంటనే వ్యతిరేకించడం అలవాటు చేసుకోవాలని యువతకు వివరించారు.

శిశు సంక్షేమ శాఖ కొవ్వొత్తుల ర్యాలీ

ఎంవీపీ కాలనీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్మూలించండి, ఆడపిల్లని రక్షించండి, చదివించండి అనే నినాదంతో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి టాస్క్ ఫోర్స్ కార్యాలయం సర్కిల్ వరకూ కొవ్వొత్తులతో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్టు డైరక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ డైరెక్టర్, బీసీ సంక్షేమ అధికారి, డ్వామా సిబ్బంది, బ్రహ్మకుమారీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడీపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బుల్లయ్య కళాశాలలో...

పెదవాల్తేరు. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మెడికల్ అండ్‌హెల్త్ డిపార్ట్‌మెంట్ (హంస) మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం బుల్లయ్య కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించనున్నారు. హంస అసోసియేషన్ అధ్యక్షుడు డి.చినబాబు ఆధ్వర్యంలో మహిళలకు కబడ్డీ, మ్యూజికల్ ఛైర్, లెమన్ అండ్ స్పూన్, వంటి క్రీడలు నిర్వహిస్తామన్నారు. అనంతరం గైనిక్ సమస్యలపై అవగాహన కల్పిస్తామన్నారు.

'మహిళా దినోత్సవ స్ఫూర్తికి ప్రభుత్వం తూట్లు'



నిరసనలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమల

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా దినోత్సవ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జీవితం దాతృత్వం కాదు అది మన హక్కు' నినాదంతో జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళా సాధికారత మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం ఇచ్చిన హామీలు అమలుకాలేదన్నారు. నిత్యం మహిళా సమాజంపై దాడులు పెరుగుతున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. జిల్లా కార్యదర్శి ఎంఏ బేగం మాట్లాడుతూ పాలకుల తీరుతో మహిళల జీవితాల్లో వెలుగులు లేకుండా పోతున్నాయన్నారు. జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, దేవుడమ్మ, అరుణ, అన్నపూర్ణ, జి.జయ, బి.పుష్పలత, పావని, మహిళలు పాల్గొన్నారు.

గ్రామ/వార్డు వలంటీర్లకు న్యాయంచేయాలి


నిరసన తెలుపుతున్న గ్రామ/వార్డు వలంటీర్లు

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి గ్రామ వలంటీర్లకు న్యాయం చేయాలని వలంటీర్ల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం 2.6 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి, వలంటీర్స్ వ్యవస్థ తీసుకొచ్చి సంక్షేమ కార్యక్రమాలు పేదలకు అందేలా రూ.5 వేల వేతనంతో నియమించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమను రోడ్డుపైన పడేసిందన్నారు. ఎన్నికల ముందు మభ్యపెట్టి అధికారం వచ్చాక మోహం చాటేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజా గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయూన్‌బాషా, ఏఐటీయూసీ కార్యదర్శి పి.రమణ, సంఘం సలహాదారులు గోపీచంద్, సురేష్‌బాబు, ప్రసాద్, రాజేష్, జగదీష్, వాసు, సుబ్బయ్య, కె.లక్ష్మణ్, రాము, చంద్రశేఖర్, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో కాలుష్య నివారణ: ఎంపీ శ్రీభరత్


ఎంపీ శ్రీభరత్‌కు జ్ఞాపిక అందిస్తున్న సభ్యులు

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని కాలుష్య నివారణకు సమష్టిగా పనిచేద్దామని విశాఖ ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. కాలుష్య నివారణకు హరించిపోతున్న పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజికవేత్తల బృందం సభ్యులు శుక్రవారం ఎంపీని కలిసి కోరారు. సామాజికవేత్త కర్రి సముద్రారెడ్డి, పర్యావరణవేత్త జీఏ నారాయణరావు, డాక్టర్ ప్రకాష్ కాలుష్య నివారణ చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలను చైతన్యవంతులను చేసి, పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. రాజకీయాలకు అతీతంగా సమాజాన్ని రక్షించుకోవాలన్నారు. విరివిగా మొక్కలు నాటాలని సూచించారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

రామ్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జన ఔషధి కేంద్రాల్లో తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అధికారులకు సూచించారు. జన ఔషధీ దివస్ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో విశాఖ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో మధురవాడలోని ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ధరలకే నాణ్యమైన మందులు లభించే ఈ కేంద్రాలపై జిల్లా అంతటా విస్తృత అవగాహన కల్పించి, నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కూన కళ్యాణి, డీఎంహెచ్‌వో ఎం.జగదీశ్వరరావు. డాక్టర్ ఎస్.ప్రశాంతి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి శుభాకాంక్షలు తెలిపిన బ్రహ్మకుమారీలు


వీసీని అభినందిస్తున్న బ్రహ్మకుమారీలు

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జి.పి.రాజశేఖర్‌ను రాజయోగ మెడిటేషన్ కేంద్రం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు బి.కె.సత్యవతి, బి.కె.రోచశ్ని, బి.కె.సన్యాసిరావు, బి.కె.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యుఎస్ (ఈబీసీ) వర్గాలకు చెందిన డీఎస్సీ సెకెండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తామని, అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, టెట్ మార్కుల జాబితా, రెండు ఫొటోలను దరఖాస్తుకు జత చేసి, ఎంవీపీ కాలనీ సర్కిల్ వద్దనున్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. వివరాలకు 9492569177నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఇద్దరు అధికారులపై చర్యలకు ఆదేశం

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నం గ్రామీణ నీటి సరఫరా విభాగం సబ్ డివిజన్‌లో బోరు బావుల తవ్వకం, పైపుల బిగింపులో అక్రమాలకు పాల్పడిన ఘటనలో ఇద్దరు అధికారులపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. నర్సీపట్నం సబ్ డివిజన్‌లో బోర్‌వెల్స్ తవ్వకం, పైపుల ఏర్పాటుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రం మేరకు బిల్లులు చెల్లించారనే అభియోగంపై అప్పటి డీఈ కె.రామస్వామి (ప్రస్తుతం రిటైరయ్యారు), అప్పటి జేఈ, ప్రస్తుత డీఈ ఎం.జయరాంపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

కన్నుల పండువగా ఎల్లమ్మ జాతర


ఆలయం వద్ద పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు


జాతర సందర్భంగా కోలాటం ఆడుతున్న మహిళలు

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాతవెంకోజీపాలెం యల్లమాంబనగర్ ఎల్లమ్మతల్లి అమ్మవారి జాతర శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలను అమర్చారు. అర్చకులు సంతోష్ శర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. యల్లమాంబ నగర్ కమిటీ సభ్యులు ఏర్పాట్లను చేశారు. కమిటీ అధ్యక్షురాలు వారణాసి విశాలాక్షి, కార్యదర్శి కాళ్ల కుమార్, కోఆర్డినేటర్ కాళ్ల అప్పలరాజు, రాజారావు, శ్యామ్‌సుందరరావు, నాగేశ్వరరావు, గంట్ల నాగరాజు, రఘు, కాళ్ల జగదీష్, పల్లా సత్యనారాయణ, కాళ్ల రమేష్ పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ సీతారామ సేవా సంఘం తరపున రామాలయం నుంచి సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన పరస మహోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, అప్పారి గిరిబాబు, మళ్ల పోలిరాజు, కర్రి వెంకటసూర్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం మెరుగుపరచుకోవాలి


మాట్లాడుతున్న డీఐసీ జనరల్ మేనేజర్ ఆదిశేషు

మద్దిలపాలెం. మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులు తమ నైపుణ్యం తీర్చిదిద్దుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు సూచించారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇండస్ట్రీ-అకాడమియా ఇంటర్న్‌షిప్-25 సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి గణనీయంగా పెరుగుతోందన్నారు. అన్ని రంగాలకు చెందిన పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయన్నారు. కొత్త పరిశ్రమల స్థాపనకు, ఉన్నవి వృద్ధి చెందడానికి తమ సంస్థ సహకరిస్తోందని తెలిపారు. పారిశ్రామిక సంస్థల్లో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. కానీ పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్‌లో వెనకబడివున్నారని, అవి మెరుగుపరచుకుంటే సులువుగా ఉపాధి లభిస్తుందన్నారు. మత్స్యపరిశ్రమ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ మత్స్య పరిశ్రమలో కూడా ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. విశాఖలో సుమారు 136 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్నందున మత్స్య సంపద అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. రొయ్యలు, చేపల పెంపకం, వాటిని నిల్వచేయడం, మత్స్య సంపద పెంచడం వంటి విధుల్లో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు


రేపటి శత్రువు నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం విశాఖ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన నాటిక ప్రదర్శనలు అలరించాయి. జ్యోతిసరళ స్మారక కళాపరిషత్ బృందం 'అనగనగా ఒకరాజు', కళాభినయ నాటక బృందం 'రేపటి శత్రువు' నాటకాలను ప్రదర్శించారు. కళ్లు మూసుకున్న రాజు మందీ మార్బలంతో ప్రజలకు కష్టాలు పెడుతుంటారు. రాజుకు నిజాలు తెలిసి తన సిబ్బందిపై చర్యలకు దిగగానే రాజునే హత్య చేస్తే ఈ లోకంలో ధర్మం ఎన్ని పాదాల మీదా నడుస్తుందనే అంశంతో అనగనగా రాజు నాటిక కళ్లకు కట్టినట్టు చూపారు. పిల్లల్ని అల్లారుముద్దుగా పెంచి ప్రయోజకలను చేస్తే వారు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో పెడుతున్నారనే మానవ సంబంధాలను తెలియజేస్తూ ప్రదర్శించిన రేపటి శత్రువు నాటిక ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్ఎన్.రాజు, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరావు, చలసాని కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన బోర్డును ఏర్పాటుచేయాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతన బోర్డును ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అందించేలా సుప్రీంకోర్టు తీర్పుని అమలుచేయాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు వాల్తేర్ రైల్వే డివిజన్, హిందూజా పవర్‌ప్లాంట్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ సదుపాయాలు కల్పించాలన్నారు. వారాంతపు సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాలన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 చట్టాలను అమలుచేయాలన్నారు. ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు జీఎస్‌జే అచ్యుతరావు, కార్యదర్శి బూసి వెంకటరావు, అధ్యక్షులు మన్మథరావు, కార్యదర్శి పి.రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో బండారు చిట్టిబాబుకు ఘన నివాళి


చిట్టిబాబుకి సంతాపం తెలుపుతున్న అధ్యాపకులు

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ సంగీత నృత్య విభాగంలో శుక్రవారం బండారు చిట్టిబాబు సంతాప సభ ఏర్పాటు చేశారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.అనురాధ చిట్టిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సంగీత సేవలను కొనియాడారు. ఉత్తరాంధ్రలో "లలిత సంగీతం" అనగానే గుర్తుకువచ్చే పేరు చిట్టిబాబు అన్నారు. లలిత సంగీతం కోర్సును ప్రారంభించడానికి ఆయనే కారణమని గుర్తుచేశారు. ఆయన నిజాయితీ, నిష్కల్మషత్వం, అంకితభావం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.సరస్వతి రాధిక, డాక్టర్ పి.వి.ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది..



కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు

కార్యాలయాలు, సంస్థల్లో ఉత్సాహంగా మహిళా దినోత్సవాలు



జిల్లా పరిషత్‌లో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు

నేడు చిల్డ్రన్ ఎరీనాలో వేడుకలు

మహారాణిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వుడా చిల్డ్రన్ ఎరినాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో వివిధ రంగాలలో ప్రతిభ చాటిన మహిళలను సత్కరిస్తామని తెలిపారు. మహిళలకు వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విశాఖపట్నం, మహరాణిపేట/డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/సీతమ్మధార మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలోనూ, జిల్లా పరిషత్‌లో చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో నారాయణమూర్తి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆర్‌డీవో శ్రీలేఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు రాణి అమ్మాజీ, శేష శైలజ, జేఏసీ నాయకులు త్రినాథరావు, నాగేశ్వరరెడ్డి, శైలజా పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని చైర్‌పర్సన్ సుభద్రత అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవిని, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. వాల్తేరు రైల్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై ఆదర్శనీయమైన సేవలందిస్తున్న 53 మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. సంఘం ప్రతినిధులు మధుస్మిత సాహు, అంకిత శర్మ, నిధి భాటి తదితరులు పాల్గొన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని పలువురు వక్తలు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పేడాడ రమణికుమారి, ఉష, రమా సత్యనారాయణ హాజరయ్యారు. మహిళల్లో మనోధైర్యాన్ని నింపేందుకు మహిళా దినోత్సవం ఒక మంచి అవకాశమన్నారు. సంప్రదాయ వస్త్రధారణతో మహిళలు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్వీన్స్ ఈవెంట్ అధినేత ఉష, మనుపల్ల, ప్రవీణ, బి.మాధురి, సంగీత, స్వర్ణ, లత, అల్లరి హారతి తదితరులు పాల్గొన్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆధ్వర్యంలో కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించి ఆపరేషన్స్ డైరెక్టర్ వి.విజయలలిత, సీజీఎంలు డి.సుమన్, కల్యాణి, బి.సులేఖరాణి, జీఎంలు ఎస్.పార్వతి, ఎం.విజయచాముండి, పి.శ్రీదేవిలను సత్కరించారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, జోన్-5 జీవీఎంసీ కార్యాలయం ఉద్యోగినుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు డా.పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో 30 మంది మహిళా అధ్యాపకులు సాధికార మహిళ అంశంపై రచించిన 'ద ఎంపవర్డ్ వుమన్' అనే బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించారు. జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోనల్ కమిషనర్ బి.రాము, ఏసీ బాబూరావులు హాజరయ్యారు. డాబాగార్డెన్స్‌లో మానవ హక్కుల విభాగం ఆధ్వర్యంలో శనివారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంఎన్‌వీ విశ్వనాథం తెలిపారు.



అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పేడాడ రమణికుమారిని సత్కరిస్తున్న మహిళలు

కబడ్డీ క్రీడాకారులకు ద్రోహం చేసిన వైసీపీ

అసెంబ్లీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆవేదన



విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కబడ్డీ క్రీడకు చేసిన ద్రోహం ఇప్పటికీ కొనసాగుతోందని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ కె.ఇ.ప్రభాకర్, వీరలంకయ్య అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరించిన ఆంధ్ర కబడ్డీ సంఘాన్ని రాజ్యసభ మాజీసభ్యుడు విజయ్‌సాయిరెడ్డి ముఠా కబ్జా చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి జి.వెంకటరెడ్డి అనే వ్యక్తి పేరుతో దొడ్డిదారిన రిజిస్టర్ చేసిన ఆంధ్ర కబడ్డీ సంఘానికి గుర్తింపు ఇచ్చి క్రీడాకారులకు తీవ్ర ద్రోహం చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులను బెదిరించడమే కాకుండా క్రీడాకారులను అనేక ఇబ్బందులకు గురిచేసి క్రీడా భవిష్యత్తుతో ఆడుకున్నారన్నారు. దొడ్డిదారిన గుర్తింపు పొందిన కబడ్డీ సంఘాన్ని ప్రక్షాళన చేసి ఉన్నత స్థాయి కబడ్డీ క్రీడాకారులతో రూపొందిన ఆంధ్రప్రదేశ్ కబడ్డీ సంఘానికి తగిన న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, క్రీడల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు చర్యలు తీసుకుని క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలని కోరారు.

సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగడమే

... 5వ పేజీ తరువాయి

జీవితం సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుంది. కానీ, అనేక కుటుంబాల్లో ఈ భరోసా మహిళలకు దక్కడం లేదు. ఎంతోమంది మహిళలు జీవన ప్రయాణాన్ని అత్యంత క్లిష్టంగా ముందుకు సాగించాల్సిన స్థితిలో ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులే కాకుండా కుటుంబపరమైన అవరోధాలు వారిని మరింత కుంగుబాటుకు గురిచేస్తున్నాయి. ఈ విషయంలో భిన్నమైన ఆలోచనలను కుటుంబ సభ్యులు కలిగి ఉండడం దురదృష్టకరం. కుటుంబ సభ్యుల సహకారం ఉంటేనే సవాళ్ల ప్రయాణం సాఫీగా సాగుతుంది.

మహిళలను వేధించే ఇబ్బందులు ఎన్నో..

పురుషులతో పోలిస్తే మహిళలను వేధించే అనారోగ్య సమస్యలు ఎన్నో. ప్రతినెలా రుతుస్రావం వల్ల ఎంతోమంది తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతుంటారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపరమైన సమస్యలు, వృత్తిపరమైన ఒత్తిళ్ల కారణంగా డిప్రెషన్ బారినపడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. తీవ్రమైన ఒత్తిడి వల్ల ఇతర అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. ఇవి కుటుంబ అభివృద్ధిని వెనక్కి లాగుతాయి.

జీవితాలు నాశనం చేసుకునేలా..

కుటుంబ సభ్యుల నుంచి దొరకని ప్రేమను బయట కోరుకునే క్రమంలో కొందరు తప్పటడుగులు వేస్తున్నారు. సామాజిక మాధ్యమాలు వినియోగం పెరిగిన తరువాత ఈ తరహా ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. అటువంటి వాటి విషయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలి. పరిధికి మించిన కోర్కెలు తప్పుడు మార్గాలవైపు వెళ్లేలా చేస్తున్నాయి. కాబట్టి, మహిళలు ఈ తరహా అట్రాక్షన్స్‌ను అదుపులో పెట్టుకుంటే జీవితం సాఫీగా ముందుకుసాగుతుంది.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు..

మహిళలు ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చూపిస్తుంటారు. ఏదైనా సమస్య వస్తే గానీ వైద్యుల వద్దకు వెళ్లరు. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దు. కొన్ని రకాల పరీక్షలను వయసును బట్టి ముందుగా చేయించుకోవాలి. సర్వైకల్ స్క్రీనింగ్, మమోగ్రఫీ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు అవకాశం ఉంది. పెళ్లికి ముందు అమ్మాయిలు తప్పనిసరిగా అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. దీనివల్ల గర్భం దాల్చిన తరువాత ఎదురయ్యే తీవ్రమైన అనారోగ్య సమస్యల ముప్పును తప్పించుకునేందుకు అవకాశం ఉంటుంది.

భరోసా ఏదీ.?

మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు, అనారోగ్య సమస్యలకు సంబంధించి కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన స్థాయిలో భరోసా లభించకపోవడం వారిని తీవ్రమైన కుంగుబాటుకు గురయ్యేలా చేస్తోంది. ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడు నేనున్నానన్న భరోసాను కల్పించినప్పుడు వారిలో కలిగే ఆనందం వేరు. ఆస్పత్రులకు మహిళలకు తోడుగా కుటుంబ సభ్యులు రావడం అరుదు. చాలామంది ఒంటరిగానే వస్తుంటారు. దీనివల్ల మహిళలు మానసికంగా మరింత కుంగుబాటుకు గురయ్యే అవకాశం ఉంది. మహిళ ఫిజికల్‌గా, మెంటల్‌గా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా ముందుకుసాగుతుంది.

వృత్తి జీవితం..

మాది తూర్పుగోదావరి జిల్లా అయినా నాన్న ఏయూలో ఫిజిక్ డిపార్టుమెంట్‌లో పనిచేయడంతో ఇక్కడే పుట్టి పెరిగా. పదో తరగతి వరకూ కొటాక్‌లో, ఇంటర్ సెయింట్ జోసఫ్‌లో చదువుకున్నా. 1986లో ఎంబీబీఎస్, హౌస్ సర్జన్ పూర్తిచేశాను. 1992లో ఆంధ్ర మెడికల్ కాలేజీలో గైనకాలజీలో పీజీ చేశాను. సాలూరులో తొలి సర్వీస్ ప్రారంభమైంది. అక్కడకు వెళ్లిన తొలి గైనకాలజీ వైద్యురాలిని నేనే. ఏజెన్సీ ప్రాంతాల్లోని మహిళలు ఇబ్బందులు అప్పుడే తనకు తెలిశాయి. ఆ తరువాత కేజీహెచ్ గైనకాలజీ విభాగంలో 1995 నుంచి 2013 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశాను. 2013లో నెల్లూరు ఆస్పత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా వెళ్లాను. 2018లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందాను. ఆ తరువాత 2023 నుంచి కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతిగా పని చేస్తున్నా. మార్చి ఒకటో తేదీన ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాను. తల్లిదండ్రులు, భర్త డాక్టర్ కేవీ రావు, కుమార్తె కృష్ణ మంజరి సహకారంతోనే వృత్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నా.

ఫుట్‌బాల్ చాంపియన్.. శ్రీధర్ ఎఫ్‌సీ

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన 9ఎ సైడ్ సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో శ్రీధర్ ఎఫ్‌సీ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆతిథ్య జీఏఆర్ఎం ఎఫ్‌సీ రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో శ్రీధర్ ఎఫ్‌సీ 1-0 గోల్‌తో జీఏఆర్ఎంపై విజయం సాధించింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు హోరాహోరీగా తలపడ్డారు. ఆట రెండో భాగంలో శ్రీధర్ ఎఫ్‌సీ ఆటగాడు అద్భుతమైన గోల్ చేసి జట్టుకు విజయాన్నందించారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సౌత్ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుల్లిపల్లి ఆనందరావు, టోర్నీ నిర్వాహకులు సుధీర్, శివకుమార్, సాయి, త్రినాథ్ (బాబు) తదితరులు పాల్గొన్నారు.



అందుకున్న ట్రోఫీతో క్రీడా విజేతలు, అతిథులు

మహిళల్లో మానసిక సమస్యలు



డాక్టర్ పూజిత జోస్యుల

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలతో బాధపడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోందని మానసిక నిపుణురాలు డాక్టర్ పూజిత జోస్యుల పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పామ్ బీచ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వృత్తి, కుటుంబపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న మహిళలు పెరుగుతున్నారన్నారు. గర్భధారణ, ప్రసవానంతరం డిప్రెషన్ బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, శరీరంలో వచ్చే మార్పులు, అనారోగ్య సమస్యలు దీనికి కారణమవుతున్నట్టు వెల్లడించారు. సకాలంలో గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని, లేకపోతే తీవ్రమైన మానసిక జబ్బులు బారినపడే అవకాశం ఉందని వెల్లడించారు. సమావేశంలో డాక్టర్ కె మాధవీ లత పాల్గొన్నారు.

సైబర్ నేరాల కట్టడికి 12 మంది హోంగార్డుల నియామకం

మహారాణిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అరికట్టేందుకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న 12 మంది బి కేటగిరి హోంగార్డులను నియమించినట్లు పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగరంలో సైబర్ నేరాలు పెరిగిపోతుండటంతో వాటి కట్టడికి తీసుకొనే చర్యలలో భాగంగా వీరిని నియమించారు. వారికి శుక్రవారం నియామక పత్రాలు అందించారు.

'సచివాలయంలోనే మాకు ఉద్యోగాలివ్వాలి'

సీతంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో గ్రేడ్-3 ఎఎన్‌ఎంలుగా పనిచేస్తున్న తమను జీఎన్ఎం శిక్షణకు పంపారని, అది పూర్తి చేసుకుని సచివాలయానికి వెళ్తే మరో ప్రాంతానికి వెళ్లి ఉద్యోగ బాధ్యతలు చేపట్టాలనడంపై ఆందోళన వ్యక్తంచేశారు. తమకు గతంలో పనిచేసిన సచివాలయంలోనే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఎన్ఎంలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తాము పనిచేసిన చోటనే ఉద్యోగంలో కొనసాగించాలని కోరుతూ జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఏఎన్ఎంలు వరలక్ష్మి, స్వాతి, ముత్యాలమ్మ, రత్నం, యోగిత, పైడితల్లి, యమున తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వద్ద ఉద్యోగుల ధర్నా

సీతమ్మధార, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీతమ్మధారలోని యూనియన్ బ్యాంక్ శాఖ వద్ద ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారానికి అయిదు రోజుల పనిదినాలు అమలు పరచాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్స్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, ఈశ్వర్, అనిల్, శర్మ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తపై వన్‌టౌన్‌లో కేసు

పూచీకత్తుపై వదిలేసిన సీఐ

మహారాణిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నాడనే ఫిర్యాదు నేపథ్యంలో గుడివాడ నియోజకవర్గానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త శ్యామ్‌సుందర్‌పై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం రావటంతో వెంటనే దక్షిణ నియోజకవర్గానికి చెందిన నాయకులకు ఆదేశించటంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి శ్యామ్‌సుందర్‌కు పూచీకత్తు ఇచ్చారు. దీనితో సీఐ అతడికి 41ఎ నోటీసు ఇచ్చి విడుదల చేశారు.

పట్టుదల చూపితే ఫార్మసీలో భవిత



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డా.ఆర్.నటరాజన్

కంచరపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ విభాగం విద్యార్థులు శుక్రవారం స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.రెడ్డీస్ ల్యాబ్ క్వాలిటీ కంట్రోల్ విభాగాధిపతి డా.ఆర్.నటరాజన్ హాజరై విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రసంగించారు. పట్టుదల, క్రమశిక్షణతో ఫార్మసీ రంగంలో అభివృద్ధి చెందవచ్చని వివరించారు. ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమన్నారు. ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, ఫార్మసీ విభాగం జె.గోవర్ధన్ మాట్లాడుతూ విద్యా నైపుణ్యం, కెరియర్ అభివృద్ధిపై కీలక సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ ముఖ్యం

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజనల్ ప్రధాన ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరాలజీ, కార్డియాలజీ, ఎండోక్రైన్, ఇతర వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. వాల్తేరు రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్‌.కె.తిరుఅరుల్ జ్యోతి, డాక్టర్ చారుమతి, డాక్టర్ లక్ష్మణ్‌రావు వైద్య బృందం పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 70 మంది అధికారులతోపాటు పలువురు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్ఎం లలిత్ బొహ్రా వైద్య పరీక్షల అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఎండోక్రైన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

ముస్లింల జుమ్మా నమాజ్

మర్రిపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌మాసం మొదటి శుక్రవారం సందర్భంగా గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం జాకీర్‌హుస్సేన్‌నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ వద్ద స్థానిక ముస్లింలు జుమ్మా నమాజ్‌ను ఆచరించారు. ఖురాన్‌లో సూక్తులను హఫీజ్ (మత గురువు) వివరిస్తూ తక్రీర్ పఠించారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్‌కు ముందు దీక్ష విరమించారు. ఈ కార్యక్రమాన్ని మజీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

గుంగులగెడ్డలో అగ్నిప్రమాదం

డాబాగార్డెన్స్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా గుంగులగెడ్డలో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గెడ్డను ఆనుకుని ఉన్న ఇంటితో పాటు చుట్టూరా ఉన్న ప్రాంతం దట్టమైన పొగలు రావడంతో కొంతసేపు స్థానికులు, వాహనదారులు, పాదచారులు భయాందోళన చెందారు. దీంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి రెండు అగ్నిమాపక శకటాల ద్వారా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు వ్యాపించడానికి గెడ్డలోని ఎవరో థర్మాకోల్ షీట్లకు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా పెద్దగా మంటలు చేలరేగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగలేదని అధికారులు తెలియజేశారు. కాసేపు వెంకటేశ్వర థియేటర్ రోడ్డు, సరస్వతీ పార్కు జంక్షన్, జగదాంబ జంక్షన్ ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాద తీవ్రత లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



గుంగులగెడ్డలో వ్యాపిస్తున్న మంటలు

మనవరాలి చెంతకు అవ్వ

అక్కయ్యపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న అన్నమ్మ (70)ను ఆమె మనవరాలు మౌనికకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. మానసిక రోగులైన ఇద్దరు కుమార్తెలు పెట్టే బాధలు భరించలేక ఇల్లు వదిలి వచ్చేసి ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర దిక్కుతోచని స్థితిలో తిరుగుతున్న ఆమెను గమనించిన రెండో పట్టణ పోలీసులు తమ సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు వసతిగృహానికి తీసుకొచ్చారన్నారు. ఆమె దగ్గర వివరాలు సేకరించి మనవరాలు మౌనికకు ఫోన్ చేసి రప్పించి అప్పగించినట్లు పేర్కొన్నారు.



'జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలి'

అక్కయ్యపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం సాయంత్రం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చన్నారు. నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జనసైనికులు, వీర మహిళలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, నాయకులు సంకు వేంకటేశ్వరరావు, దివాకర్, బోడసింగి శ్రీధర్, గుడివాడ అప్పారావు, త్రివేణి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భారీ అన్న సమారాధన

అక్కయ్యపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైల్వేన్యూకాలనీలో వేంచేసిన పరదేశమ్మ అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పెద్దఎత్తున అన్నసమారాధన జరిగింది. సుమారు పదివేల మంది విచ్చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు బోర వెంకటరమణారెడ్డి, కార్యదర్శి కోరాడ సత్యశివరావు, కోశాధికారి జీరు శ్రీనివాసరెడ్డి, మొల్లేటి అప్పారావు, దువ్వి కాళీప్రసాద్, జీఆర్కే రాజు, తాతాజీ, పోలారావు పాల్గొన్నారు.

సొంత ఆలోచనలకు అనుగుణంగా ఎదగాలి

... 5వ పేజీ తరువాయి

ఎంతో ఉంది. వారికి సమానత్వంపై విశ్వాసం ఎక్కువ. వారి నుంచి లభిస్తున్న నిరంతర సహకారం వల్లనే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. నంద్యాలలో సబ్ కలెక్టర్‌గా, జిల్లా హౌసింగ్ అధికారిణిగా, సీతంపేట ఐటీడీఏ పీఓగా పనిచేశా. ఇప్పుడు జీసీసీలో ఉన్నా. విశాఖ ఏజెన్సీలో పండించే పసుపునకు కూడా ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకువచ్చి, ఇక్కడి రైతులకు మంచి గిట్టుబాటు ధర అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా.

దాసు ఔట్

... 5వ పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు హెచ్‌పీసీఎల్‌లో భూ సేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సనపల సుధాసాగర్‌ను డీటీఓగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడితో ఆ శాఖలో వివాదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని అంతా భావిస్తున్నారు. ఆర్‌డీగా కూడా పూర్తిస్థాయి అధికారిని నియమిస్తే ప్రభుత్వం అనుకున్నట్టుగా జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులు ఊపందుకునే అవకాశం ఉంది.

టీడీఆర్‌ల జారీలో అవకతవకలు

... 5వ పేజీ తరువాయి

11,296 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రూ.ఐదు వేల వంతున చెల్లించారన్నారు. వారిలో 3,311 మందికే డబ్బులు తిరిగి ఇచ్చారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు గజం రూ.60 వేల ధర ఖరారుచేసి కొన్ని ప్లాట్లు అమ్మకానికి పెట్టగా వైసీపీ నాయకులంతా కుమ్మక్కై గజం రూ.60,500కు దక్కించుకున్నారని ఆరోపించారు. ఇంకా మిగిలిన ప్లాట్లు అమ్మకం కోసం అధికారులు ఇటీవల వరకూ యత్నించారని, ఈ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. భూముల విలువ పెరిగినందున వేలం రద్దు చేసి ప్రభుత్వ వినియోగానికి అనువుగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలో తప్పులు

... 5వ పేజీ తరువాయి

వివరాలు సంబంధిత ఎయిడెడ్ యాజమాన్యం/డీఈవో కార్యాలయంలో ఉంటాయి. ఆ వివరాలకు జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసిన కాలాన్ని కలిపి సీనియారిటీ ఖరారు చేయాలి. కానీ ఆ విధంగా చేయకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు టీచర్లు డీఈవో దృష్టికి తీసుకువచ్చారు. సాధారణంగా ఉపాధ్యాయుల నియామక సమయంలోనే రోస్టర్ కమ్ మెరిట్ జాబితా రూపొందించి దాని ప్రకారమే ఉద్యోగాలు ఇస్తారు. ఆ ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలి. కానీ విద్యా శాఖలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 1994 నుంచి 2018 వరకూ జరిగిన డీఎస్సీలకు సంబంధించి మెరిట్ కమ్ రోస్టర్ జాబితాల ఆధారంగా ప్రస్తుతం సీనియారిటీ జాబితా తయారు చేయలేదని టీచర్లు మండిపడుతున్నారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఒక ఉద్యోగి (డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న టీచర్) నిర్వాకంతో మెరిట్ కమ్ రోస్టర్ జాబితాలు కొన్ని కనిపించడం లేదని, అందుబాటులో ఉన్న జాబితాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ విద్యా విభాగం నిర్వాకంతో నగరంలో మునిసిపల్ పాఠశాలల టీచర్ల సీనియారిటీ వివరాలు మొత్తం తప్పులతడకగా ఉన్నట్టు పలువురు టీచర్లు ఆరోపిస్తున్నారు. వాటిని ఒకటికి రెండుసార్లు పరిశీలించకుండా ఇప్పుడు జాబితా తయారుచేశారనే వాదన ఉంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సీనియారిటీ జాబితాలో జూనియర్ల పేర్లు ముందుండి తరువాత సీనియర్ల పేర్లు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను విశాఖ డీఈవో కార్యాలయంలో స్వీకరిస్తున్నారు. జిల్లాల విభజన జరిగినా అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి టీచర్లు విశాఖ రావాల్సి వస్తుండడంపై సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. కొత్త జిల్లాల వారీగా అభ్యంతరాలు స్వీకరించి అక్కడ నుంచి వాటిని విశాఖకు పంపాలని కోరుతున్నారు. సీనియారిటీ జాబితాపై టీచర్ల నుంచి అభ్యంతరాల స్వీకరణకు ఈనెల పదో తేదీ వరకూ ఇచ్చిన గడువును పెంచాలని కోరుతున్నారు. జాబితాలో తప్పులు సవరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిట్టిబ్బాయి వేర్వేరుగా డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

నేడు మహిళా ఖైదీలకు మిఠాయిల పంపిణీ

ఆరిలోవ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళా ఖైదీలకు శనివారం మిఠాయిలు పంపిణీ చేస్తామని జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. పలు ఎన్జీవోలు వేడుకలు నిర్వహించేందుకు ముందుకువచ్చినా ప్రభుత్వం నుంచి అనుమతి లభించలేదన్నారు. ఈ నేపథ్యంలో జైలులోని 83 మంది ఖైదీలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు.

తూనికలో లోపాలుంటే కేసులు

ఎంవీపీ కాలనీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైతు బజారులో కూరగాయలు విక్రయించే రైతులు తమ కాటాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, లేదంటే కేసులు తప్పవని ఎంవీపీ కాలనీ రైతు బజారు ఎస్టేట్ అధికారి వరహాలు హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ కాటాలపై స్టాంపు గడువు పూర్తయితే వెంటనే పునరుద్ధరించుకోవాలని సూచించారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం చేపట్టిన తనిఖీల్లో ఐదుగురు రైతులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఎలక్ట్రానిక్ తూకంపై స్టాంపు గడువు అయిపోయినా, వినియోగించడంపైనా కేసులు నమోదు చేశారని, రైతులందరూ తూకాల్లో కచ్చితమైన కొలతలు ఉండేలా చూసుకోవాలన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


వానపల్లి శ్రీనివాస్

ఆరిలోవ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత నెల 28వ తేదీ నుంచి తన సోదరుడు కనిపించడం లేదంటూ ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు అందిది. వివరాలివి... గాంధీనగర్‌కు చెందిన వానపల్లి శ్రీనివాస్(35) గత నెల 28న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదని బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వాకబు చేసినా ఫలితం కనిపించలేదని అతని సోదరుడు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్‌కు మతిస్థిమితం లేదని, మానసిక దివ్యాంగుడని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 94906 17918 నంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ మల్లేశ్వరరావు కోరారు.

రోజుకు 330 టన్నుల చెత్త సేకరణ

ఆరిలోవ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముడసర్లోవ డంపింగ్‌యార్డుకు ప్రతిరోజూ 330 టన్నుల చెత్త వస్తోందని సిబ్బంది తెలిపారు. ఈ చెత్తను జోన్ -2. జోన్-3, జోన్-5 నుంచి సేకరిస్తున్నారన్నారు. చెత్తను ఇక్కడ వేయింగ్ మెషీన్‌లో వేసి వివరాలు నమోదు చేస్తారన్నారు. ఇలా వచ్చిన చెత్తను సాయంత్రంలోగా కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంటుకు తరలిస్తారన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్:** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 44, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళదుంపలు 15, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 56, అల్లం 50, బరబాటి 32, ముల్లంగి 2, నిమ్మకాయలు (కిలో) 95, బద్దచిక్కుడు 44, దోస కాయలు 28, వెల్లుల్లి 115, కొబ్బరికాయ 25, బీన్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 56, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190


జీవీఎంసీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది


దుర్గాబాయ్ దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలి

- యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి
- జీవీఎంసీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించి, ఆర్థికంగా బలోపేతం కావాలని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం.సత్యవేణి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ సర్వీసెస్(జెమ్స్) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవీఎంసీలో మహిళా దినోత్సవం నిర్వహించిన జెమ్స్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినా వారికి అన్యాయం జరుగుతోందన్నారు. మహిళలలో చిన్నప్పటి నుంచే మనోధైర్యాన్ని నింపాలన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యుదయానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉద్యోగంతో పాటు ఇంటిని చక్కదిద్దే పని మహిళలు చేస్తారని వారి సేవలు వెలకట్టలేనివన్నారు. అనంతరం జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తూ, ఆర్థికంగా బలపడి, మనో ధైర్యంతో విధులు నిర్వహించాలన్నారు. భీమిలి జోనల్ కమిషనర్ పి.ప్రసన్నవాణి తన విద్యాభ్యాసాన్ని, ఉద్యోగ నిర్వహణలో అనుభవాల్ని పంచుకున్నారు. అనంతరం జెమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగంతో పాటు ఉద్యమాలలో, సామాజిక, సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఎస్‌ఏ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుబ్బలక్ష్మి, విశాఖ ప్రధాన కార్యదర్శి ఇ.అప్పలరాజు, జెమ్స్, వైస్‌ప్రెసిడెంట్ ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీలో శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు

యువత ఆలోచనలు ఉన్నతంగా ఉండాలి

వెంకోజీపాలెం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): యువత ఆలోచనలు మంచి ఉద్దేశంతో ఉన్నతంగా సాగాలని నారీ శక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి అన్నారు. ఏయూ దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. మార్పు మన నుంచి ప్రారంభం కావాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలనే తపనతో సాగాలన్నారు. కలలను సాకారం చేసుకునే దిశలో గురువుల పాఠాలు ఉపయోగపడతాయన్నారు. ఆలోచనలో స్పష్టత, లక్ష్యం దిశగా నిరంతర శ్రమ అవసరమన్నారు. సమానత్వం, ఐకమత్యంతో మెలగడం, సోదర భావం కలిగి ఉండడం ప్రధానమని తెలిపారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతా మాణిక్యం మాట్లాడుతూ మహిళలు తమ సమర్థతను రుజువు చేసుకోవాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్యలతో ఉన్న వారికి చేయూతనివ్వడం, సహాయం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. స్త్రీలపై హింస తగ్గాలని, ఇతరుల నుంచి అసహజ ప్రవర్తన గుర్తిస్తే, వెంటనే వ్యతిరేకించడం అలవాటు చేసుకోవాలని యువతకు వివరించారు.

శిశు సంక్షేమ శాఖ కొవ్వొత్తుల ర్యాలీ

ఎంవీపీ కాలనీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్మూలించండి, ఆడపిల్లని రక్షించండి, చదివించండి అనే నినాదంతో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి టాస్క్ ఫోర్స్ కార్యాలయం సర్కిల్ వరకూ కొవ్వొత్తులతో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్టు డైరక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ డైరెక్టర్, బీసీ సంక్షేమ అధికారి, డ్వామా సిబ్బంది, బ్రహ్మకుమారీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడీపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బుల్లయ్య కళాశాలలో...

పెదవాల్తేరు. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మెడికల్ అండ్‌హెల్త్ డిపార్ట్‌మెంట్ (హంస) మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం బుల్లయ్య కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించనున్నారు. హంస అసోసియేషన్ అధ్యక్షుడు డి.చినబాబు ఆధ్వర్యంలో మహిళలకు కబడ్డీ, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, వంటి క్రీడలు నిర్వహిస్తామన్నారు. అనంతరం గైనిక్ సమస్యలపై అవగాహన కల్పిస్తామన్నారు.

'మహిళా దినోత్సవ స్ఫూర్తికి ప్రభుత్వం తూట్లు'


నిరసనలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమల

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా దినోత్సవ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జీవితం దాతృత్వం కాదు అది మన హక్కు' నినాదంతో జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళా సాధికారత మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం ఇచ్చిన హామీలు అమలుకాలేదన్నారు. నిత్యం మహిళా సమాజంపై దాడులు పెరుగుతున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. జిల్లా కార్యదర్శి ఎంఏ బేగం మాట్లాడుతూ పాలకుల తీరుతో మహిళల జీవితాల్లో వెలుగులు లేకుండా పోతున్నాయన్నారు. జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, దేవుడమ్మ, అరుణ, అన్నపూర్ణ, జి.జయ, బి.పుష్పలత, పావని, మహిళలు పాల్గొన్నారు.

గ్రామ/వార్డు వలంటీర్లకు న్యాయంచేయాలి


నిరసన తెలుపుతున్న గ్రామ/వార్డు వలంటీర్లు

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి గ్రామ వలంటీర్లకు న్యాయం చేయాలని వలంటీర్ల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి గంధం దీప్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం 2.6 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి, వలంటీర్స్ వ్యవస్థ తీసుకొచ్చి సంక్షేమ కార్యక్రమాలు పేదలకు అందేలా రూ.5 వేల వేతనంతో నియమించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమను రోడ్డుపైన పడేసిందన్నారు. ఎన్నికల ముందు మభ్యపెట్టి అధికారం వచ్చాక మోహం చాటేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజా గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయూన్‌బాషా, ఏఐటీయూసీ కార్యదర్శి పి.రమణ, సంఘం సలహాదారులు గోపీచంద్, సురేష్‌బాబు, ప్రసాద్, రాజేష్, జగదీష్, వాసు, సుబ్బయ్య, కె.లక్ష్మణ్, రాము, చంద్రశేఖర్, శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో కాలుష్య నివారణ: ఎంపీ శ్రీభరత్


ఎంపీ శ్రీభరత్‌కు జ్ఞాపిక అందిస్తున్న సభ్యులు

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని కాలుష్య నివారణకు సమష్టిగా పనిచేద్దామని విశాఖ ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. కాలుష్య నివారణకు హరించిపోతున్న పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజికవేత్తల బృందం సభ్యులు శుక్రవారం ఎంపీని కలిసి కోరారు. సామాజికవేత్త కర్రి సముద్రారెడ్డి, పర్యావరణవేత్త జీఏ నారాయణరావు, డాక్టర్ ప్రకాష్ కాలుష్య నివారణ చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలను చైతన్యవంతులను చేసి, పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. రాజకీయాలకు అతీతంగా సమాజాన్ని రక్షించుకోవాలన్నారు. విరివిగా మొక్కలు నాటాలని సూచించారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

రామ్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జన ఔషధి కేంద్రాల్లో తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అధికారులకు సూచించారు. జన ఔషధీ దివస్ సందర్భగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో విశాఖ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో మధురవాడలోని ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ధరలకే నాణ్యమైన మందులు లభించే ఈ కేంద్రాలపై జిల్లా అంతటా విస్తృత అవగాహన కల్పించి, నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కూన కళ్యాణి, డీఎంహెచ్‌వో ఎం.జగదీశ్వరరావు. డాక్టర్ ఎస్.ప్రశాంతి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి శుభాకాంక్షలు తెలిపిన బ్రహ్మకుమారీలు


వీసీని అభినందిస్తున్న బ్రహ్మకుమారీలు

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జి.పి.రాజశేఖర్‌ను రాజయోగ మెడిటేషన్ కేంద్రం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు బి.కె.సత్యవతి, బి.కె.రోచస్విని, బి.కె.సన్యాసిరావు, బి.కె.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యుఎస్ (ఈబీసీ) వర్గాలకు చెందిన డీఎస్సీ సెకెండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తామని, అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, టెట్ మార్కుల జాబితా, రెండు ఫొటోలను దరఖాస్తుకు జత చేసి, ఎంవీపీ కాలనీ సర్కిల్ వద్దనున్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. వివరాలకు 9492569177నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఇద్దరు అధికారులపై చర్యలకు ఆదేశం

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నం గ్రామీణ నీటి సరఫరా విభాగం సబ్ డివిజన్‌లో బోరు బావుల తవ్వకం, పైపుల బిగింపులో అక్రమాలకు పాల్పడిన ఘటనలో ఇద్దరు అధికారులపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. నర్సీపట్నం సబ్ డివిజన్‌లో బోర్‌వెల్స్ తవ్వకం, పైపుల ఏర్పాటుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రం మేరకు బిల్లులు చెల్లించారనే అభియోగంపై అప్పటి డీఈ కె.రామస్వామి (ప్రస్తుతం రిటైరయ్యారు), అప్పటి జేఈ, ప్రస్తుత డీఈ ఎం.జయరాంపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

కన్నుల పండువగా ఎల్లమ్మ జాతర


ఆలయం వద్ద పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు


జాతర సందర్భంగా కోలాటం ఆడుతున్న మహిళలు

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాతవెంకోజీపాలెం యల్లమాంబనగర్ ఎల్లమ్మతల్లి అమ్మవారి జాతర శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలను అమర్చారు. అర్చకులు సంతోష్ శర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. యల్లమాంబ నగర్ కమిటీ సభ్యులు ఏర్పాట్లను చేశారు. కమిటీ అధ్యక్షురాలు వారణాసి విశాలాక్షి, కార్యదర్శి కాళ్ల కుమార్, కోఆర్డినేటర్ కాళ్ల అప్పలరాజు, రాజారావు, శ్యామ్‌సుందరరావు, నాగేశ్వరరావు, గంట్ల నాగరాజు, రఘు, కాళ్ల జగదీష్, పల్లా సత్యనారాయణ, కాళ్ల రమేష్ పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ సీతారామ సేవా సంఘం తరపున రామాలయం నుంచి సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన పరస మహోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, అప్పారి గిరిబాబు, మళ్ల పోలిరాజు, కర్రి వెంకటసూర్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం మెరుగుపరచుకోవాలి


మాట్లాడుతున్న డీఐసీ జనరల్ మేనేజర్ ఆదిశేషు

మద్దిలపాలెం. మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులు తమ నైపుణ్యం తీర్చిదిద్దుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు సూచించారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇండస్ట్రీ-అకాడమియా ఇంటర్న్‌షిప్-25 సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి గణనీయంగా పెరుగుతోందన్నారు. అన్ని రంగాలకు చెందిన పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయన్నారు. కొత్త పరిశ్రమల స్థాపనకు, ఉన్నవి వృద్ధి చెందడానికి తమ సంస్థ సహకరిస్తోందని తెలిపారు. పారిశ్రామిక సంస్థల్లో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. కానీ పరిశ్రమలకు అవసరమైన స్కిల్స్‌లో వెనకబడివున్నారని, అవి మెరుగుపరచుకుంటే సులువుగా ఉపాధి లభిస్తుందన్నారు. మత్స్యపరిశ్రమ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ మత్స్య పరిశ్రమలో కూడా ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. విశాఖలో సుమారు 136 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్నందున మత్స్య సంపద అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. రొయ్యలు, చేపల పెంపకం, వాటిని నిల్వచేయడం, మత్స్య సంపద పెంచడం వంటి విధుల్లో యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు


రేపటి శత్రువు నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం విశాఖ డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన నాటిక ప్రదర్శనలు అలరించాయి. జ్యోతిసరళ స్మారక కళాపరిషత్ బృందం 'అనగనగా ఒకరాజు', కళాభినయ నాటక బృందం 'రేపటి శత్రువు' నాటకాలను ప్రదర్శించారు. కళ్లు మూసుకున్న రాజు మందీ మార్బలంతో ప్రజలకు కష్టాలు పెడుతుంటారు. రాజుకు నిజాలు తెలిసి తన సిబ్బందిపై చర్యలకు దిగగానే రాజునే హత్య చేస్తే ఈ లోకంలో ధర్మం ఎన్ని పాదాల మీదా నడుస్తుందనే అంశంతో అనగనగా రాజు నాటిక కళ్లకు కట్టినట్టు చూపారు. పిల్లల్ని అల్లారుముద్దుగా పెంచి ప్రయోజకలను చేస్తే వారు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో పెడుతున్నారనే మానవ సంబంధాలను తెలియజేస్తూ ప్రదర్శించిన రేపటి శత్రువు నాటిక ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు ఎం.ఎస్ఎన్.రాజు, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరావు, చలసాని కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన బోర్డును ఏర్పాటుచేయాలి


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

సిరిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతన బోర్డును ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అందించేలా సుప్రీంకోర్టు తీర్పుని అమలుచేయాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు వాల్తేర్ రైల్వే డివిజన్, హిందూజా పవర్‌ప్లాంట్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ, పెన్షన్ సదుపాయాలు కల్పించాలన్నారు. వారాంతపు సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాలన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 44 చట్టాలను అమలుచేయాలన్నారు. ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు జీఎస్‌జే అచ్యుతరావు, కార్యదర్శి బూసి వెంకటరావు, అధ్యక్షులు మన్మథరావు, కార్యదర్శి పి.రమణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో బండారు చిట్టిబాబుకు ఘన నివాళి


చిట్టిబాబుకి సంతాపం తెలుపుతున్న అధ్యాపకులు

వెంకోజీపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ సంగీత నృత్య విభాగంలో శుక్రవారం బండారు చిట్టిబాబు సంతాప సభ ఏర్పాటు చేశారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.అనురాధ చిట్టిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సంగీత సేవలను కొనియాడారు. ఉత్తరాంధ్రలో "లలిత సంగీతం" అనగానే గుర్తుకువచ్చే పేరు చిట్టిబాబు అన్నారు. లలిత సంగీతం కోర్సును ప్రారంభించడానికి ఆయనే కారణమని గుర్తుచేశారు. ఆయన నిజాయితీ, నిష్కల్మషత్వం, అంకితభావం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.సరస్వతి రాధిక, డాక్టర్ పి.వి.ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది..

కార్యాలయాలు, సంస్థల్లో ఉత్సాహంగా మహిళా దినోత్సవాలు


కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు


జిల్లా పరిషత్‌లో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు

విశాఖపట్నం, మహరాణిపేట/డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/సీతమ్మధార మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలోనూ, జిల్లా పరిషత్‌లో చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో నారాయణమూర్తి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆర్‌డీవో శ్రీలేఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు రాణి అమ్మాజీ, శేష శైలజ, జేఏసీ నాయకులు త్రినాథరావు, నాగేశ్వరరెడ్డి, శైలజా పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని చైర్‌పర్సన్ సుభద్రత అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవిని, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. వాల్తేరు రైల్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమానికి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై ఆదర్శనీయమైన సేవలందిస్తున్న 53 మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. సంఘం ప్రతినిధులు మధుస్మిత సాహూ, అంకిత శర్మ, నిధి భాటి తదితరులు పాల్గొన్నారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని పలువురు వక్తలు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పేడాడ రమణి కుమారి, ఉష, రమా సత్యనారాయణ హాజరయ్యారు. మహిళల్లో మనోధైర్యాన్ని నింపేందుకు మహిళా దినోత్సవం ఒక మంచి అవకాశమన్నారు. సంప్రదాయ వస్త్రధారణతో మహిళలు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్వీన్స్ ఈవెంట్ అధినేత ఉష, మనుపల్ల, ప్రవీణ, బి.మాధురి, సంగీత, స్వర్ణ, లత, అల్లరి హారతి తదితరులు పాల్గొన్నారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆధ్వర్యంలో కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించి ఆపరేషన్స్ డైరెక్టర్ వి.విజయలలిత, సీజీఎంలు డి.సుమన్, కల్యాణి, బి.సులేఖరాణి, జీఎంలు ఎస్.పార్వతి, ఎం.విజయచాముండి, పి.శ్రీదేవిలను సత్కరించారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, జోన్-5 జీవీఎంసీ కార్యాలయం ఉద్యోగినుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు డా.పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో 30 మంది మహిళా అధ్యాపకులు సాధికార మహిళ అంశంపై రచించిన 'ద ఎంపవర్డ్ వుమన్' అనే బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించారు. జ్ఞానాపురం జోన్-5 కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోనల్ కమిషనర్ బి.రాము, ఏసీ బాబూరావులు హాజరయ్యారు. డాబాగార్డెన్స్‌లో మానవ హక్కుల విభాగం ఆధ్వర్యంలో శనివారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ విశ్వనాథం తెలిపారు.



అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పేడాడ రమణికుమారిని సత్కరిస్తున్న మహిళలు

నేడు చిల్డ్రన్ ఎరీనాలో వేడుకలు

మహారాణిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వుడా చిల్డ్రన్ ఎరినాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో వివిధ రంగాలలో ప్రతిభ చాటిన మహిళలను సత్కరిస్తామని తెలిపారు. మహిళలకు వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కబడ్డీ క్రీడాకారులకు ద్రోహం చేసిన వైసీపీ



అసెంబ్లీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆవేదన

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కబడ్డీ క్రీడకు చేసిన ద్రోహం ఇప్పటికీ కొనసాగుతోందని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన శాసనసభలో మాట్లాడుతూ కె.ఇ.ప్రభాకర్, వీరలంకయ్య అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరించిన ఆంధ్ర కబడ్డీ సంఘాన్ని రాజ్యసభ మాజీసభ్యుడు విజయ్‌సాయిరెడ్డి ముఠా కబ్జా చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి జి.వెంకటరెడ్డి అనే వ్యక్తి పేరుతో దొడ్డిదారిన రిజిస్టర్ చేసిన ఆంధ్ర కబడ్డీ సంఘానికి గుర్తింపు ఇచ్చి క్రీడాకారులకు తీవ్ర ద్రోహం చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులను బెదిరించడమే కాకుండా క్రీడాకారులను అనేక ఇబ్బందులకు గురిచేసి క్రీడా భవిష్యత్తుతో ఆడుకున్నారన్నారు. దొడ్డిదారిన గుర్తింపు పొందిన కబడ్డీ సంఘాన్ని ప్రక్షాళన చేసి ఉన్నత స్థాయి కబడ్డీ క్రీడాకారులతో రూపొందిన ఆంధ్రప్రదేశ్ కబడ్డీ సంఘానికి తగిన న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, క్రీడల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు చర్యలు తీసుకుని క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలని కోరారు.

సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగడమే

... 5వ పేజీ తరువాయి

జీవితం సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుంది. కానీ, అనేక కుటుంబాల్లో ఈ భరోసా మహిళలకు దక్కడం లేదు. ఎంతోమంది మహిళలు జీవన ప్రయాణాన్ని అత్యంత క్లిష్టంగా ముందుకు సాగించాల్సిన స్థితిలో ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులే కాకుండా కుటుంబపరమైన అవరోధాలు వారిని మరింత కుంగుబాటుకు గురిచేస్తున్నాయి. ఈ విషయంలో భిన్నమైన ఆలోచనలను కుటుంబ సభ్యులు కలిగి ఉండడం దురదృష్టకరం. కుటుంబ సభ్యుల సహకారం ఉంటేనే సవాళ్ల ప్రయాణం సాఫీగా సాగుతుంది.

మహిళలను వేధించే ఇబ్బందులు ఎన్నో..

పురుషులతో పోలిస్తే మహిళలను వేధించే అనారోగ్య సమస్యలు ఎన్నో. ప్రతినెలా రుతుస్రావం వల్ల ఎంతోమంది తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతుంటారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపరమైన సమస్యలు, వృత్తిపరమైన ఒత్తిళ్ల కారణంగా డిప్రెషన్ బారినపడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. తీవ్రమైన ఒత్తిడి వల్ల ఇతర అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. ఇవి కుటుంబ అభివృద్ధిని వెనక్కి లాగుతాయి.

జీవితాలు నాశనం చేసుకునేలా..

కుటుంబ సభ్యుల నుంచి దొరకని ప్రేమను బయట కోరుకునే క్రమంలో కొందరు తప్పటడుగులు వేస్తున్నారు. సామాజిక మాధ్యమాలు వినియోగం పెరిగిన తరువాత ఈ తరహా ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. అటువంటి వాటి విషయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలి. పరిధికి మించిన కోర్కెలు తప్పుడు మార్గాలవైపు వెళ్లేలా చేస్తున్నాయి. కాబట్టి, మహిళలు ఈ తరహా అట్రాక్షన్స్‌ను అదుపులో పెట్టుకుంటే జీవితం సాఫీగా ముందుకుసాగుతుంది.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు..

మహిళలు ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చూపిస్తుంటారు. ఏదైనా సమస్య వస్తే గానీ వైద్యుల వద్దకు వెళ్లరు. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దు. కొన్ని రకాల పరీక్షలను వయసును బట్టి ముందుగా చేయించుకోవాలి. సర్వైకల్ స్క్రీనింగ్, మమోగ్రఫీ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు అవకాశం ఉంది. పెళ్లికి ముందు అమ్మాయిలు తప్పనిసరిగా అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. దీనివల్ల గర్భం దాల్చిన తరువాత ఎదురయ్యే తీవ్రమైన అనారోగ్య సమస్యల ముప్పును తప్పించుకునేందుకు అవకాశం ఉంటుంది.

భరోసా ఏదీ.?

మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులు, అనారోగ్య సమస్యలకు సంబంధించి కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన స్థాయిలో భరోసా లభించకపోవడం వారిని తీవ్రమైన కుంగుబాటుకు గురయ్యేలా చేస్తోంది. ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడు నేనున్నానన్న భరోసాను కల్పించినప్పుడు వారిలో కలిగే ఆనందం వేరు. ఆస్పత్రులకు మహిళలకు తోడుగా కుటుంబ సభ్యులు రావడం అరుదు. చాలామంది ఒంటరిగానే వస్తుంటారు. దీనివల్ల మహిళలు మానసికంగా మరింత కుంగుబాటుకు గురయ్యే అవకాశం ఉంది. మహిళ ఫిజికల్‌గా, మెంటల్‌గా ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా ముందుకుసాగుతుంది.

వృత్తి జీవితం..

మాది తూర్పుగోదావరి జిల్లా అయినా నాన్న ఏయూలో ఫిజిక్ డిపార్టుమెంట్‌లో పనిచేయడంతో ఇక్కడే పుట్టి పెరిగా. పదో తరగతి వరకూ కొటాక్‌లో, ఇంటర్ సెయింట్ జోసఫ్‌లో చదువుకున్నా. 1986లో ఎంబీబీఎస్, హౌస్ సర్జన్ పూర్తిచేశాను. 1992లో ఆంధ్ర మెడికల్ కాలేజీలో గైనకాలజీలో పీజీ చేశాను. సాలూరులో తొలి సర్వీస్ ప్రారంభమైంది. అక్కడకు వెళ్లిన తొలి గైనకాలజీ వైద్యురాలిని నేనే. ఏజెన్సీ ప్రాంతాల్లోని మహిళలు ఇబ్బందులు అప్పుడే తనకు తెలిశాయి. ఆ తరువాత కేజీహెచ్ గైనకాలజీ విభాగంలో 1995 నుంచి 2013 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశాను. 2013లో నెల్లూరు ఆస్పత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా వెళ్లాను. 2018లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందాను. ఆ తరువాత 2023 నుంచి కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతిగా పని చేస్తున్నా. మార్చి ఒకటో తేదీన ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాను. తల్లిదండ్రులు, భర్త డాక్టర్ కేవీ రావు, కుమార్తె కృష్ణ మంజరి సహకారంతోనే వృత్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నా.

సొంత ఆలోచనలకు అనుగుణంగా ఎదగాలి

... 5వ పేజీ తరువాయి

ఎంతో ఉంది. వారికి సమానత్వంపై విశ్వాసం ఎక్కువ. వారి నుంచి లభిస్తున్న నిరంతర సహకారం వల్లనే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. నంద్యాలలో సబ్ కలెక్టర్‌గా, జిల్లా హౌసింగ్ అధికారిణిగా, సీతంపేట ఐటీడీఏ పీఓగా పనిచేశా. ఇప్పుడు జీసీసీలో ఉన్నా. విశాఖ ఏజెన్సీలో పండించే పసుపునకు కూడా ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకువచ్చి, ఇక్కడి రైతులకు మంచి గిట్టుబాటు ధర అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా.

దాసు ఔట్

... 5వ పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు హెచ్‌పీసీఎల్‌లో భూ సేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సనపల సుధాసాగర్‌ను డీటీఓగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడితో ఆ శాఖలో వివాదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని అంతా భావిస్తున్నారు. ఆర్‌డీగా కూడా పూర్తిస్థాయి అధికారిని నియమిస్తే ప్రభుత్వం అనుకున్నట్టుగా జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులు ఊపందుకునే అవకాశం ఉంది.

టీడీఆర్‌ల జారీలో అవకతవకలు

... 5వ పేజీ తరువాయి

11,296 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రూ.ఐదు వేల వంతున చెల్లించారన్నారు. వారిలో 3,311 మందికే డబ్బులు తిరిగి ఇచ్చారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు గజం రూ.60 వేల ధర ఖరారుచేసి కొన్ని ప్లాట్లు అమ్మకానికి పెట్టగా వైసీపీ నాయకులంతా కుమ్మక్కై గజం రూ.60,500కు దక్కించుకున్నారని ఆరోపించారు. ఇంకా మిగిలిన ప్లాట్లు అమ్మకం కోసం అధికారులు ఇటీవల వరకూ యత్నించారని, ఈ విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. భూముల విలువ పెరిగినందున వేలం రద్దు చేసి ప్రభుత్వ వినియోగానికి అనువుగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలో తప్పులు

... 5వ పేజీ తరువాయి

వివరాలు సంబంధిత ఎయిడెడ్ యాజమాన్యం/డీఈవో కార్యాలయంలో ఉంటాయి. ఆ వివరాలకు జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేసిన కాలాన్ని కలిపి సీనియారిటీ ఖరారు చేయాలి. కానీ ఆ విధంగా చేయకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని కొందరు టీచర్లు డీఈవో దృష్టికి తీసుకువచ్చారు. సాధారణంగా ఉపాధ్యాయుల నియామక సమయంలోనే రోస్టర్ కమ్ మెరిట్ జాబితా రూపొందించి దాని ప్రకారమే ఉద్యోగాలు ఇస్తారు. ఆ ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలి. కానీ విద్యా శాఖలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 1994 నుంచి 2018 వరకూ జరిగిన డీఎస్సీలకు సంబంధించి మెరిట్ కమ్ రోస్టర్ జాబితాల ఆధారంగా ప్రస్తుతం సీనియారిటీ జాబితా తయారు చేయలేదని టీచర్లు మండిపడుతున్నారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఒక ఉద్యోగి (డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న టీచర్) నిర్వాకంతో మెరిట్ కమ్ రోస్టర్ జాబితాలు కొన్ని కనిపించడం లేదని, అందుబాటులో ఉన్న జాబితాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ విద్యా విభాగం నిర్వాకంతో నగరంలో మునిసిపల్ పాఠశాలల టీచర్ల సీనియారిటీ వివరాలు మొత్తం తప్పులతడకగా ఉన్నట్టు పలువురు టీచర్లు ఆరోపిస్తున్నారు. వాటిని ఒకటికి రెండుసార్లు పరిశీలించకుండా ఇప్పుడు జాబితా తయారుచేశారనే వాదన ఉంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సీనియారిటీ జాబితాలో జూనియర్ల పేర్లు ముందుండి తరువాత సీనియర్ల పేర్లు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను విశాఖ డీఈవో కార్యాలయంలో స్వీకరిస్తున్నారు. జిల్లాల విభజన జరిగినా అల్లూరి, అనకాపల్లి జిల్లాల నుంచి టీచర్లు విశాఖ రావాల్సి వస్తుండడంపై సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. కొత్త జిల్లాల వారీగా అభ్యంతరాలు స్వీకరించి అక్కడ నుంచి వాటిని విశాఖకు పంపాలని కోరుతున్నారు. సీనియారిటీ జాబితాపై టీచర్ల నుంచి అభ్యంతరాల స్వీకరణకు ఈనెల పదో తేదీ వరకూ ఇచ్చిన గడువును పెంచాలని కోరుతున్నారు. జాబితాలో తప్పులు సవరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, యూటీఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిట్టిబ్బాయి వేర్వేరుగా డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

ఫుట్‌బాల్ చాంపియన్.. శ్రీధర్ ఎఫ్‌సీ



అందుకున్న ట్రోఫీతో క్రీడా విజేతలు, అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన 9ఎ సైడ్ సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో శ్రీధర్ ఎఫ్‌సీ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆతిథ్య జీఏఆర్ఎం ఎఫ్‌సీ రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో శ్రీధర్ ఎఫ్‌సీ 1-0 గోల్‌తో జీఏఆర్ఎంపై విజయం సాధించింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల ఆటగాళ్లు హోరాహోరీగా తలపడ్డారు. ఆట రెండో భాగంలో శ్రీధర్ ఎఫ్‌సీ ఆటగాడు అద్భుతమైన గోల్ చేసి జట్టుకు విజయాన్నందించారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సౌత్ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుల్లిపల్లి ఆనందరావు, టోర్నీ నిర్వాహకులు సుధీర్, శివకుమార్, సాయి, త్రినాథ్ (బాబు) తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో మానసిక సమస్యలు


డాక్టర్ పూజిత జోస్యుల

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలతో బాధపడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోందని మానసిక నిపుణురాలు డాక్టర్ పూజిత జోస్యుల పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫామ్ బీచ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వృత్తి, కుటుంబపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న మహిళలు పెరుగుతున్నారన్నారు. గర్భధారణ, ప్రసవానంతరం డిప్రెషన్ బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, శరీరంలో వచ్చే మార్పులు, అనారోగ్య సమస్యలు దీనికి కారణమవుతున్నట్టు వెల్లడించారు. సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని, లేకపోతే తీవ్రమైన మానసిక జబ్బులు బారినపడే అవకాశం ఉందని వెల్లడించారు. సమావేశంలో డాక్టర్ కె మాదవీ లత పాల్గొన్నారు.

సైబర్ నేరాల కట్టడికి 12 మంది హోంగార్డుల నియామకం

మహారాణిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అరికట్టేందుకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న 12 మంది బి కేటగిరి హోంగార్డులను నియమించినట్లు పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. నగరంలో సైబర్ నేరాలు పెరిగిపోతుండటంతో వాటి కట్టడికి తీసుకొనే చర్యలలో భాగంగా వీరిని నియమించారు. వారికి శుక్రవారం నియామక పత్రాలు అందించారు.

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తపై వన్‌టౌన్‌లో కేసు

పూచీకత్తుపై వదిలేసిన సీఐ

మహారాణిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెడుతున్నాడనే ఫిర్యాదు నేపథ్యంలో గుడివాడ నియోజకవర్గానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త శ్యామ్‌సుందర్‌పై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి సమాచారం రావటంతో వెంటనే దక్షిణ నియోజకవర్గానికి చెందిన నాయకులకు ఆదేశించటంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి శ్యామ్‌సుందర్‌కు పూచీకత్తు ఇచ్చారు. దీనితో సీఐ అతడికి 41ఎ నోటీసు ఇచ్చి విడుదల చేశారు.

ముస్లింల జుమ్మా నమాజ్

మర్రిపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌మాసం మొదటి శుక్రవారం సందర్భంగా గ్రేటర్ పరిధి 53వ వార్డు మర్రిపాలెం జాకీర్‌హూస్సేన్‌నగర్‌లోని మజీద్ ఈ అల్ ఖదీర్ వద్ద స్థానిక ముస్లింలు జుమ్మా నమాజ్‌ను ఆచరించారు. ఖురాన్‌లో సూక్తులను హఫీజ్ (మత గురువు) వివరిస్తూ తక్రీర్ పఠించారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్‌కు ముందు దీక్ష విరమించారు. ఈ కార్యక్రమాన్ని మజీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

మనవరాలి చెంతకు అవ్వ



అక్కయ్యపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న అన్నమ్మ (70)ను ఆమె మనవరాలు మౌనికకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగఢ వాసు తెలిపారు. మానసిక రోగులైన ఇద్దరు కుమార్తెలు పెట్టే బాధలు భరించలేక ఇల్లు వదిలి వచ్చేసి ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర దిక్కుతోచని స్థితిలో తిరుగుతున్న ఆమెను గమనించిన రెండో పట్టణ పోలీసులు తమ సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు వసతిగృహానికి తీసుకొచ్చారన్నారు. ఆమె దగ్గర వివరాలు సేకరించి మనవరాలు మౌనికకు ఫోన్ చేసి రప్పించి అప్పగించినట్లు పేర్కొన్నారు.

'సచివాలయంలోనే మాకు ఉద్యోగాలివ్వాలి'

సీతంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో గ్రేడ్-3 ఎన్ఎంలుగా పనిచేస్తున్న తమను జీఎన్ఎం శిక్షణకు పంపారని, అది పూర్తి చేసుకుని సచివాలయానికి వెళ్తే మరో ప్రాంతానికి వెళ్లి ఉద్యోగ బాధ్యతలు చేపట్టాలనడంపై ఆందోళన వ్యక్తంచేశారు. తమకు గతంలో పనిచేసిన సచివాలయంలోనే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ఏఎన్ఎంలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తాము పనిచేసిన చోటనే ఉద్యోగంలో కొనసాగించాలని కోరుతూ జిల్లా వైద్యాధికారికి వినతి పత్రం సమర్పించారు. ఏఎన్ఎంలు వరలక్ష్మి, స్వాతి, ముత్యాలమ్మ, రత్నం, యోగిత, పైడితల్లి, యమున తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వద్ద ఉద్యోగుల ధర్నా

సీతమ్మధార, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీతమ్మధారలోని యూనియన్ బ్యాంక్ శాఖ వద్ద ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఆర్.వసంతరావు మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారానికి అయిదు రోజుల పనిదినాలు అమలు పరచాలని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్స్ డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, ఈశ్వర్, అనిల్, శర్మ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టుదల చూపితే ఫార్మసీలో భవిత



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డా.ఆర్.నటరాజన్

కంచరపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసీ విభాగం విద్యార్థులు శుక్రవారం స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.రెడ్డీస్ ల్యాబ్ క్వాలిటీ కంట్రోల్ విభాగాధిపతి డా.ఆర్.నటరాజన్ హాజరై విద్యార్థులను ఆకట్టుకునేలా ప్రసంగించారు. పట్టుదల, క్రమశిక్షణతో ఫార్మసీ రంగంలో అభివృద్ధి చెందవచ్చని వివరించారు. ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమన్నారు. ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, ఫార్మసీ విభాగం జె.గోవర్ధన్ మాట్లాడుతూ విద్యా నైపుణ్యం, కెరియర్ అభివృద్ధిపై కీలక సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ ముఖ్యం


కంటి పరీక్ష చేయించుకుంటున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజనల్ ప్రధాన ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరాలజీ, కార్డియాలజీ, ఎండోక్రైన్, ఇతర వ్యాధులకు సంబంధించి అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు. వాల్తేరు రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్‌కె.తిరుఅరుల్ జ్యోతి, డాక్టర్ చారుమతి, డాక్టర్ లక్ష్మణ్‌రావు వైద్య బృందం పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 70 మంది అధికారులతోపాటు పలువురు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్ఎం లలిత్ బొహ్రా వైద్య పరీక్షల అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఎండోక్రైన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గుంగులగెడ్డలో అగ్నిప్రమాదం


గుంగులగెడ్డలో వ్యాపిస్తున్న మంటలు

డాబాగార్డెన్స్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా గుంగులగెడ్డలో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గెడ్డను ఆనుకుని ఉన్న ఇంటితో పాటు చుట్టూరా ఉన్న ప్రాంతం దట్టమైన పొగలు రావడంతో కొంతసేపు స్థానికులు, వాహనదారులు, పాదచారులు భయాందోళన చెందారు. దీంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి రెండు అగ్నిమాపక శకటాల ద్వారా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు వ్యాపించడానికి గెడ్డలోని ఎవరో థర్మాకోల్ షీట్లకు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా పెద్దగా మంటలు చేలరేగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగలేదని అధికారులు తెలియజేశారు. కాసేపు వెంకటేశ్వర థియేటర్ రోడ్డు, సరస్వతీ పార్కు జంక్షన్, జగదాంబ జంక్షన్ ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాద తీవ్రత లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

'జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలి'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం సాయంత్రం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చన్నారు. నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జనసైనికులు, వీర మహిళలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, నాయకులు సంకు వేంకటేశ్వరరావు, దివాకర్, బోడసింగి శ్రీధర్, గుడివాడ అప్పారావు, త్రివేణి పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

అక్కయ్యపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైల్వేన్యూకాలనీలో వేంచేసిన పరదేశమ్మ అమ్మవారి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పెద్దఎత్తున అన్నసమారాధన జరిగింది. సుమారు పదివేల మంది విచ్చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు బోర వెంకట రమణారెడ్డి, కార్యదర్శి కోరాడ సత్యశివరావు, కోశాధికారి జీరు శ్రీనివాసరెడ్డి, మొల్లేటి అప్పారావు, దువ్వి కాశీప్రసాద్, జీఆర్కే రాజు, తాతాజీ, పోలారావు పాల్గొన్నారు.

కొండల్ని గుల్ల చేసేస్తున్నారు..

- నరవ గ్రామంలో రెచిపోతున్న అక్రమార్కులు
- ఎక్స్‌కవేటర్‌తో రాత్రిపూట ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- ఫిర్యాదులు అందితే తప్పా గనులశాఖ అధికారులు స్పందించడం లేదని వెల్లువెత్తుతున్న విమర్శలు



సర్వే నంబర్-29లో తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం

గోపాలపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): క్వారీ తవ్వకాలకు అనుమతులు లేకపోయినా అక్రమంగా కొండలను తవ్వేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు పలువురు అక్రమార్కులు. గనుల శాఖ అధికారులు గానీ రెవెన్యూ శాఖ, జీవీఎంసీ అధికారులు కానీ స్పందించకపోవడంతో నరవ గ్రామంలో అక్రమంగా క్వారీ తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. ఏడేళ్ల నుంచి ప్రభుత్వం ఎటువంటి అనుమతులు ఇవ్వకపోయినా ఈ ప్రాంతానికి చెందిన అక్రమార్కులు గ్రామంలోని కొండలను పిండి చేసేస్తున్నారు.

అంతా రాత్రివేళలోనే..

గ్రామంలో గడిచిన రెండున్నర దశాబ్దాల కాలంగా అక్రమంగా క్వారీల తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. సర్వే నంబర్-29లో గల సుమారు 30 ఎకరాల భూమిలో భారీగా తవ్వకాలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకపోయినా నిరాటంకంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంతో ఈ ప్రాంతం అగాధంలా మారిపోతుంది. ఇటీవల కొంతకాలం పాటు అక్రమార్కులు కాస్త వెనకడుగు వేసినా గత ఆరు నెలల నుంచి మళ్లీ విజృంభిస్తున్నారు. గ్రామంలోని కొండవాలు ప్రాంత సమీపంలోని జీడితోటల్లో ఎక్స్‌కవేటర్‌ను ఉంచి రాత్రి వేళల్లో దర్జాగా తవ్వకాలు చేపట్టి భారీ డంపర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రామంలోని అన్ని సరిహద్దుల్లో తమ మనుషులను కాపలాగా ఉంచి యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

ఫిర్యాదులు చేస్తే తప్పా స్పందించని గనులశాఖ అధికారులు!

నరవలో క్వారీ తవ్వకాలు అక్రమంగా జరుగుతున్న విషయం దాదాపుగా అన్ని శాఖల అధికారులకు తెలిసిందే. అయితే ఈ విషయంపై దృష్టి సారించాల్సిన గనుల శాఖ అధికారులు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే తప్పా స్పందించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అక్రమార్కులు అడ్డూ అదుపు లేకుండా తవ్వకాలు జరుపుతున్నారు. దీనిపై గనులశాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోతే భవిష్యత్తులో ఇక్కడ కొండలు కనుమరుగవుతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం వార్డు సచివాలయ, రెవెన్యూ సిబ్బందిని గనులశాఖ అధికారులు సమన్వయం చేస్తే అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నరవలో నిత్యం సుమారు 500 యూనిట్ల మేర గ్రావెల్ అక్రమంగా తరలిపోతున్నట్టు సమాచారం. మార్కెట్‌లో దీని విలువ రూ.5 లక్షల వరకు ఉంటుంది. నిత్యం జరుగుతున్న ఈ తవ్వకాలతో ఇప్పటికే రూ.కోట్లలో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుంది.

అధికారుల తీరుపై అనుమానాలు..

నరవలో గ్రావెల్ తవ్వకాలు అక్రమంగా జరుగుతున్న విషయం గ్రామంలో అందరికీ తెలిసిందే. దీనిపై గ్రామ సచివాలయ సిబ్బంది గానీ రెవెన్యూ అధికారులు కానీ దృష్టి సారించకపోవడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. గనులశాఖ అధికారులకు కూడా అక్రమ తవ్వకాలపై సమాచారం ఉన్నప్పటికీ వారికి అక్రమార్కులతో ఉన్న సత్సంబంధాల కారణంగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా జరుగుతున్న క్వారీల తవ్వకాల వల్ల నరవ నుంచి సత్తివానిపాలెం గ్రామ శివారు వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర కొండలకు భారీ అగాధాలు ఏర్పడ్డాయి. అందువల్ల ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లిదండ్రులు హెల్మెట్లు ధరించేలా చూడండి

- విద్యార్థులకు సూచించిన దువ్వాడ ట్రాఫిక్ సీఐ వెంకటరావు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న దువ్వాడ సీఐ వెంకటరావు

కూర్మన్నపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై తల్లిదండ్రులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు వారు తప్పకుండా హెల్మెట్లు ధరించేలా చూడాలని విద్యార్థులకు దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు సూచించారు. శుక్రవారం ఇక్కడి శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్‌పై అవగాహన లేమితో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మైనర్లకు పలువురు తల్లిదండ్రులు వాహనాలు నడపడం నేర్పిస్తూ వారు ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నారన్నారు. మైనర్ డ్రైవింగ్ పట్ల ట్రాఫిక్ పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా తల్లిదండ్రుల నుంచి స్పందన లేకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. కాలేజీలకు బైకులపై వెళ్తామని పిల్లలు కోరడం.. తల్లిదండ్రులు ఖరీదైన వాహనాలను కొని ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు అతి వేగంగా బైకులను నడుపుతూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారన్నారు. పాఠశాలలు, కాలేజీలకు ఆటోలపై వెళ్లే విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటరావు సూచించారు.

సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు: పెందుర్తి సీఐ శ్రీనివాసరావు

పెందుర్తి; సిగ్నల్స్ చూసి రోడ్డు దాటడం, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం చేయరాదని ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. ముఖ్యంతా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. స్థానిక అమృత ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లోని విద్యార్థినులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ అందరూ గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవాలన్నారు. తొలుత నూతన ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు విధించే జరిమానా టారిఫ్‌ను ప్రదర్శించారు. అలాగే విద్యార్థినులకు ఆయన మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నరసింగరాజు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్య పరిష్కారానికి ముందుకొచ్చిన భెల్ యాజమాన్యం

10న పీఎఫ్ అధికారులతో చర్చించనున్న భెల్ హెచ్‌పీవీపీ యాజమాన్య ప్రతినిధులు



పీఎఫ్ అధికారులకు రికార్డులు అందజేస్తున్న భెల్ అధికారులు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పీఎఫ్ సమస్యపై గత కొన్ని నెలలుగా ఆందోళన చెందుతున్న భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు సంస్థ యాజమాన్యం ముందుకువచ్చింది. 1992లో చేరిన (ఆర్-సిరీస్) కార్మికులకు అప్పటినుంచి వేతనాల్లో పీఎఫ్ రికవరీ చేసినప్పటికీ, వారికి 2011లో పర్మినెంట్ చేయడంతో వారి పీఎఫ్ నమోదులో పలు సమస్యలు ఏర్పడ్డాయి. కొంతమంది కార్మికులకు పీఎఫ్ రికవరీ తేదీ 1997 సంవత్సరం నమోదు కాగా మరికొంతమందికి 2011 నుంచి రికవరీ అవుతున్నట్టు నమోదయ్యాయి. జాయినింగ్ తేదీ నమోదులో జరిగిన పొరపాట్ల వల్ల సుమారు 150 కార్మికులకు ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్‌లో తీవ్ర ఆర్థిక నష్టం ఏర్పడనున్నది. దీంతో కార్మికులు గత కొన్ని నెలలుగా ఈ సమస్యను పరిష్కరించాలని ఆందోళనలు చేపట్టడంతో పాటు పలువురు నాయకులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గుర్తింపు కార్మిక సంఘం యాజమాన్యంతో జరిపిన చర్చల్లో పీఎఫ్ అధికారులు అడిగిన కార్మికుల రికార్డులను శుక్రవారం భెల్ యాజమాన్యం అందజేసింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు భెల్ యాజమాన్య ప్రతినిధులు పీఎఫ్ అధికారులతో ఈ నెల 10న చర్చించనున్నట్టు గుర్తింపు కార్మిక సంఘ నాయకులు ఎస్.సాహు, కొల్లి దేముడు, పీవీఎన్ రాజు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్, తదితరులు

జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

ఎంపీ ఎం.శ్రీభరత్

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జన ఔషధి కేంద్రాల్లో తక్కువ ధరలకే నాణ్యమైన జనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అధికారులకు సూచించారు. జన ఔషధీ దివస్ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో విశాఖ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో మధురవాడలోని ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ధరలకే నాణ్యమైన మందులు లభించే ఈ కేంద్రాలపై జిల్లా అంతటా విస్తృత అవగాహన కల్పించి, నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కూన కళ్యాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.జగదీశ్వరరావు. డాక్టర్ ప్రశాంతి, పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని బీసీ, ఈడబ్ల్యుఎస్ (ఈబీసీ) వర్గాలకు చెందిన డీఎస్సీ సెకెండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తామని, అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, టెట్ మార్కుల జాబితా, రెండు ఫొటోలను దరఖాస్తుకు జత చేసి, ఎంవీపీ కాలనీ సర్కిల్ వద్దనున్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు. వివరాలకు 9492569177నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కారును ఢీకొన్న వ్యాన్: ఒకరికి గాయాలు

కూర్మన్నపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న ఓ కారును వ్యాన్ ఢీకొనడంతో కారు బాగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆ వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

శ్రీనగర్‌లో శ్రీకష్ణుడికి ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లోని శ్రీవిజయ గణపతి, శ్రీరమా సత్యనారాయణస్వామి, శ్రీకృష్ణ గోవర్ధన గిరి ఆలయంలో సప్తమి వార్షికోత్సలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, సకల దేవతా మండపారాధన, కలశ స్థాపన, 108 కలశాలతో క్షీరాభిషేకాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ హోమం జరిపారు. భజన పాటలు, సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణ గోవర్ధన గిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆవాల సూర్యనారాయణ, కరేటి సహదేవుడు మాట్లాడుతూ ఈ ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు.

టీడీఆర్ బాండ్ల స్కామ్‌పై విచారణ జరపాలి: అసెంబ్లీలో ఎమ్మెల్యే 'పల్లా'



గాజువాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విస్తరణకు అవసరం లేని రోడ్లకు సైతం గత ప్రభుత్వ హయాంలో టీడీఆర్ బాండ్‌లను ఇచ్చి భారీ ఎత్తున స్కామ్‌కు పాల్పడ్డారని, అధికారులు, వ్యాపారుల, రాజకీయ నాయకులు కుమ్మకై టీడీఆర్ బాండ్ల స్కామ్‌కు పాల్పడ్డారని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ స్కామ్‌కు పాల్పడిన వారిపై విజిలెన్స్ విచారణ జరపాలన్నారు. గాజువాకలో వీఎంఆర్డీఏ 60 అడుగుల రోడ్డు వేసిన క్రమంలో చక్రపాణి అనే రిటైర్డ్ ఉద్యోగికి చెందిన స్థలం రోడ్డు విస్తరణలో కోల్పోగా.. ఆయన టీడీఆర్ కోసం కాళ్లరిగేలా జీవీఎంసీ కార్యాలయం చుట్టు తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. చివరకు ఆయనకు ఇచ్చిన లేఖలో కణితికి ఆనుకుని ఉన్న రోడ్డులో స్థలం పోయినట్టుగా పేర్కొన్నారన్నారు. ఇలాంటి స్కామ్‌లకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించరాదన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులే ప్రస్తుతం కొనసాగుతుండడం వల్ల పనులు ఎలా జరుగుతాయన్నారు. విశాఖలో భవనాలు నిర్మించకుండానే థర్డ్ పార్టీకి రూ.60 కోట్లతో గత ప్రభుత్వం రైట్స్ క్రియేట్ చేసిందన్నారు. ఇందులో వైసీపీకి రూ.11కోట్లు, నాటి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి విజయసాయిరెడ్డికి రూ.20కోట్లు ముట్టాయన్నారు. దీనిపై విచారణ జరపాలన్నారు.

రైల్వే బోర్డు డైరెక్టర్‌గా సుగుణ



ఉక్కుటౌన్‌షిప్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో సీనియర్ మేనేజర్ (రాజభాష)గా విధులు నిర్వహిస్తున్న వి.సుగుణ భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వశాఖలోని రైల్వే బోర్డులో డైరెక్టర్ (అధికారిక భాష)గా ఎంపికయ్యారు. ప్లాంటులో 1992లో జాయిన్ అయిన ఆమె అధికారిక భాష అమలులో విశేష కృషి చేశారు. అధికారిక భాష అమలుకు సంబంధించి వివిధ అవార్డులు అందుకున్న సుగుణ రైల్వే బోర్డులో డైరెక్టర్‌గా ఎంపికవ్వడంతో పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

అక్కిరెడ్డిపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, దేశ, దైవభక్తి ఎంతో అవసరమని బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. వెంకటేశ్వరకాలనీలో శుక్రవారం బీవీకే పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన విద్యార్థులను అందిస్తున్న బీవీకే విద్యా సంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సుభాషిణి, వీఆర్ సత్యనారాయణ, జ్యోత్స్న, కూనూరు అప్పలరాజు, నాగరాజు, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం చేస్తున్న దృశ్యం

ముగిసిన కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

వేపగుంట, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. ఉదయం శ్రీవారికి సుప్రభాత సేవ, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, చక్రస్నానం చేశారు. రాత్రి ఏడు గంటలకు స్వామికి పుష్పయాగం, ద్వాదశారాధనలు, ఊంజల్ సేవ, విశేష పూజ, భోగ నివేదనలు, రుత్వికులకు సన్మానం జరిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన రుత్వికులకు, ఉత్సవాలకు సహకరించిన వారికి ఈవో బండారు ప్రసాద్ కల్యాణ వెంకన్న జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసస్వామి, సారథి, ఆదినారాయణరావు, సన్యాసిరావు, కృష్ణమూర్తి, వర్మ, శ్రీమరి, దేవుళ్ల పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-1లో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో 34వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 12 వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో విశేష పూజలు చేసి వేడుకలకు అంకురార్పణ చేశారు. శనివారం ధ్వజారోహణం, 9న వైదిక సదస్యం, సుదర్శన హోమం, పండిత సదస్యం, 10న లక్ష తులసీపూజ, 11న లక్ష కుంకుమార్చన, 12న ధ్వజారోరోహణం, చక్రస్నానం, పుష్పయాగం, ఊంజల్ సేవ జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ గుర్తింపు కార్డుల పంపిణీ

ఎన్.ఎ.డి..జంక్షన్, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో 199, 200 బూత్‌లలో టీడీపీ సభ్యత్వాలు తీసుకున్న వారికి శుక్రవారం గుర్తింపు కార్డులను పార్టీ వార్డు అధ్యక్షుడు వాసుదేవరావు అందజేశారు. టీడీపీ సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, కేబుల్ రాజు, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

నీరు దుర్వినియోగంపై ఫిర్యాదు

ఎన్.ఎ.డి..జంక్షన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో ఉన్న శృతి టిఫిన్ సెంటర్ నిర్వాహకులు రాత్రిపూట జీవీఎంసీ నీటిని అక్రమంగా వినియోగిస్తున్నారంటూ సంబంధిత అధికారులకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు తగిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

సినిమా గైడ్

- **శబ్దం** : సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా** : శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్** : జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్** : మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 42, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 34 దొండకాయలు 38, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 95, బద్దచిక్కుడు 44, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 115, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 45, కీరదోస 28, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 56, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



ధర్నాలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ

పెదగంట్యాడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇంటక్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్‌చేస్తూ అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బాలచెరువు గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఏ ఒక్కరిని తొలగించినా వారి కుటుంబం నడిరోడ్డున పడుతుందన్నారు. కాంట్రాక్టు కార్మికుల్లో 270 మందిని ఆన్‌లైన్ నుంచి తొలగించారని, ఈ అంశాన్ని లేబర్ కమిషనర్ దగ్గరకు వెళ్లినా యాజమాన్యం మొండి వైఖరిని అవలంబిస్తుండడం దారుణమన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, ఉరుకూటి అప్పారావు, పితాని భాస్కరరావు, దేవర అప్పారావు, జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నాయకులకు ఇచ్చిన షోకాజు నోటీసులను ఉపసంహరించుకోవాలి

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ కార్మిక వర్గంపై యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, ఇది మంచి పద్ధతి కాదని ఉక్కు అఖిలపక్ష కార్మిక నాయకులు అన్నారు. కార్మిక నాయకులకు యాజమాన్యం ఇచ్చిన నోటీసుకు నిరసనగా శుక్రవారం ప్లాంట్ టీటీఐ జంక్షన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం ప్రశ్నించే నాయకులకు షోకాజు నోటీసులు ఇవ్వడం భావ్యం కాదన్నారు. కార్మికులు అడిగిన ప్రశ్నలకు యాజమాన్యం సమాధానం చెప్పాలన్నారు. యాజమాన్యం ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వైటీ దాసు, పీవీ రమణమూర్తి, జె.అయోధ్యరామ్, రామస్వామి, కారు రమణ, జి.గణపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

గోపాలపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తున్నారు. రంజాన్ నెల మొదటి శుక్రవారం కావడంతో గోపాలపట్నంలోని తాహ మసీదు, కొత్తపాలెంలోని నూరానియా మసీదు, నందమూరినగర్‌లోని ఉమర్ సుల్తాన్ మసీదుల్లో శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ నెలను పురస్కరించుకుని మసీదుల్లో ప్రతిరోజు ఐదు వేళలా ఆచరించే నమాజులతో పాటు రంజాన్ నెలలో రాత్రి వేళలో ఆచరించే తరావీ నమాజుల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొంటున్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే సమయంలో మసీదుల్లో నిర్వహించే ఇఫ్తార్‌కు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొనడంతో మసీదుల్లో పండగ వాతావరణ నెలకొంటుంది.

విజయావకాశాలను మహిళలు అందిపుచ్చుకోవాలి

ఆటోనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతులు తలచుకుంటే ఆకాశమే హద్దుగా ఏ రంగంలోనైనా విజయావకాశాలను సొంతం చేసుకుంటారని కణితి హై స్కూల్ హెచ్ఎం బి.సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మ్యాజిక్ బస్ అధికారి కె.సురేంద్రకుమార్, ఎస్ఎంసీ వైస్ చైర్మన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నిర్మల స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ మహిళలందరూ తమకున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సేవా మార్గదర్శి!

కెరీర్‌ను పక్కనపెట్టి.. సేవా మార్గం ఎంచుకుని మహిళల అభివృద్ధికి కృషిచేస్తున్న ఊహా మహంతి

- రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా కార్యక్రమాలు
- నిరుపేదల ఆరోగ్య, ఆర్థిక వృద్ధికి కృషి
- తాత ప్రారంభించిన సంస్థకు కొనసాగింపు

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):

వారిది ఆర్థికంగా స్థితిమంతమైన కుటుంబం.. ఉన్నత చదువులు పూర్తిచేయడంతో సివిల్ సర్వీసెస్ చేయాలనేది ఆమె ఆకాంక్ష. అందుకు కుటుంబసభ్యుల ప్రోత్సాహం లభించింది. ఈ దశలో ఎవరైనా లక్ష్యం వైపు అడుగు వేస్తారు. కానీ డాక్టర్ ఊహా మహంతి విభిన్నంగా ఆలోచించారు. తాత ప్రారంభించిన రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని భావించారు. ఇందుకోసం ఉజ్వల భవిష్యత్తును వదులుకున్నారు. గ్రామీణ, ఏజెన్సీ, మురికివాడల్లోని నిరుపేదల అభివృద్ధికి దోహదపడేలా సంస్థను తీర్చిదిద్ది విజయవంతంగా సాగుతున్నారు. ఎనిమిదేళ్లుగా ఉత్తరాంధ్రలో విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె విజయగాథ.

విజయనగరం జిల్లా గరుడబిల్లి గ్రామానికి చెందిన మహంతి గణపతిరావు 1991లో రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో సంస్థను ప్రారంభించారు. ఊహా మహంతి తండ్రి సురేష్ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. వారితో పాటు సంస్థలో భాగస్థురాలైన ఊహ 2013లో తాత మరణం తరువాత మరింత దృష్టి సారించారు. 2016 నుంచి సంస్థ డైరెక్టర్‌గా విభిన్న రీతిలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా సంస్థను నిర్వహిస్తున్నారు. సంస్థ ఆరంభంలో మద్యపాన నిషేధం, విద్య మీద పనిచేసిన సంస్థ.. ఊహ ప్రవేశం ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేలా తీర్చిదిద్దారు.



విద్యార్థులకు అందించిన స్కూల్ బ్యాగ్ కిట్లతో ఊహా మహంతి (ఫైల్)



గిరిజన మహిళలకు నాప్కిన్ వాడకంపై అవగాహన కల్పిస్తూ...

ఇందులో భాగంగా నిరుపేద చిన్నారులకు 31 రకాల వస్తువులతో కిట్లు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు 7,800 మందికి వీటిని అందించారు. ఏజెన్సీలో బాల్య వివాహాలను రూపుమాపేందుకు కృషిచేస్తున్నారు. ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు తమ వంతుగా స్థానికంగా ఉద్యోగ, ఉపాధి మార్గాలను చూపిస్తున్నారు. ఇందుకోసం యువతులకు బ్యూటీషియన్, టైలరింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇప్పించడంతోపాటు బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చూసి, స్వయం ఉపాధి దిశగా వారిని నడిపిస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు 1,560 మందికి శిక్షణ ఇచ్చారు. మరో 600 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు అందించారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ..

ఈ సంస్థ మహిళలు, బాలికల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తోంది. పీరియడ్స్ సమయంలో జాగ్రత్తలు పాటించక అనారోగ్య సమస్యలకు గురవుతున్న విషయాన్ని గుర్తించి ప్రతినెలా 15 వేల మందికి శానిటరీ నాప్కిన్స్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. విశాఖ అర్బన్‌లో 1,800 మందికి, అనకాపల్లి జిల్లాలో మూడు వేల మందికి, మిగిలినవి ఏజెన్సీ ప్రాంతాల్లోని మహిలకు అందిస్తున్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. గంజాయి/డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. జెండర్ ఈక్వాలిటీ పైనా సంస్థ పనిచేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ ఆధ్వర్యంలో 280 మంది వలంటీర్లు పని చేస్తుండగా ఇటీవల కమ్యూనిటీ ప్లే హబ్స్‌ను ప్రారంభించారు. ప్రతిభ గల బాల బాలికలను గుర్తించి క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. 25 చోట్ల మినీ లైబ్రరీలను, మరో 25 చోట్ల స్పోర్ట్స్ క్లబ్‌లను ఏర్పాటు చేసి క్రీడా సామగ్రిని అందించారు. త్వరలో డిజిటల్ లైబ్రరీ ప్రారంభించనున్నామని ఊహా మహంతి తెలిపారు. వీటి ద్వారా ఖరీదైన కోర్సులను గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులకు అందిస్తామని, దీనికి అవసరమైన టెక్నాలజీ, పరికరాలను ఐఐటీ ముంబై సమకూరుస్తోందన్నారు. భవిష్యత్తులో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా మరిన్ని కోర్సుల్లో శిక్షణ అందించడంతో పాటు తగిన రుణాలు లభ్యమయ్యేలా కృషి చేస్తామన్నారు. మహిళలు, బాలికల ఆరోగ్యం, అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



ఉపాధి కల్పవల్లి



ఆర్డర్లపై తయారుచేసిన బ్యాగ్‌లు, మెటీరియల్ పరిశీలిస్తున్న సరస్వతి

- జూట్‌బ్యాగ్‌ల తయారీతో మహిళలకు ఆసరా
- రూ.10వేల పెట్టుబడితో ఏడాదికి కోటి టర్నోవర్
- కఠోర శ్రమతో విజయం సాధించిన సరస్వతి

(పెందుర్తి, ఆంధ్రజ్యోతి)

సాధించాలనే తపన... అందుకు తగ్గ ప్రణాళిక, కఠోర శ్రమ మహిళలను సమున్నత స్థానానికి తీసుకువెళ్తాయని నిరూపించారు పెందుర్తికి చెందిన వాన సరస్వతి. కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహిస్తూనే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే దిశగా తన ఆలోచనకు పదునుపెట్టి జూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పారు. కేవలం రూ.పదివేల పెట్టుబడితో ప్రారంభించిన ఈ కేంద్రం ప్రస్తుతం ఏడాదికి రూ.కోటి టర్నోవర్‌కు చేరుకోవడమే కాకుండా 30 మంది మహిళలకు బాసటగా నిలిచింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సరస్వతి విజయగాథ.

శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలంలోని సోమరాజుపురం పొత్తూరుకు చెందిన వానా సరస్వతి, మనోహరరావుతో దంపతులు బతుకుతెరువు కోసం 35 ఏళ్ల కిందట పెందుర్తి వచ్చేశారు. భర్త పెట్రోల్‌బంకులో పనిచేస్తుండడం, చాలీచాలనీ సంపాదనతో జీవనం కష్టమైంది. దీంతో తనకు తెలిసిన విద్య టైలరింగ్ ద్వారా భర్తకు తోడుగా నిలిచారు సరస్వతి. అయినప్పటికీ ఆర్థిక కష్టాలు వెంటాడుతుండడంతో జూట్ బ్యాగుల తయారీ ఆలోచన చేశారు. కుటుంబ సహకారంతో పెందుర్తిలోనే యూనిట్‌ను స్థాపించి మరింత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. పదేళ్ల కిందట భర్త మృతిచెందగా, ఇద్దరు కుమారులను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దారు.



వానా సరస్వతిని సత్కరిస్తున్న సీఎం నారా చంద్రబాబునాయుడు (ఫైల్ ఫొటో)

మహిళా సంఘం సహకారంతో...

నూకాంబికా మహిళా సంఘ సభ్యురాలిగా తొలుత తన ఆలోచనలను మిగిలిన సభ్యులతో పంచుకున్నారు. కేవలం రూ. పది వేల పెట్టుబడితో 1999లో జూట్‌బ్యాగుల తయారీ కేంద్రం ప్రారంభించారు. సంఘ సభ్యుల్లో కొందరు ఎవరి మిషన్ వారు తెచ్చుకుని పనులు నిర్వహించేవారు. అయితే వారిలో ఆసక్తి లేక ఉత్పత్తి నెమ్మదించింది. ఈ నేపథ్యంలో 2002లో మాత మహిళా సంక్షేమ సంఘం ఏర్పాటుచేశారు సభ్యులంగా ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. వారికి జూట్‌బ్యాగ్‌ల తయారీలో మెలకువలు నేర్పి, తన సంస్థలో ఉపాధి కల్పించారు.

వివిధ ప్రాంతాలకు ఎగుమతి

డ్వాక్రా సంఘ రుణంతో పాటు యూనిట్ పనితీరు బాగుండడంతో బ్యాంకు నుంచి రుణం లభించింది. జూట్‌బ్యాగ్ యూనిట్‌ను పర్యవేక్షిస్తూనే ఆర్డర్ల కోసం సరస్వతి తీవ్రంగా శ్రమించారు. నగరంలో వివిధ దుకాణాల వారిని కలిసి, బ్యాగుల నాణ్యను వివరించారు. దీంతో కొంతమంది వస్త్ర వ్యాపారుల నుంచి ఆర్డర్లు వచ్చాయి. అంతటితో ఆగకుండా శ్రీకాకుళం విజయనగరం, గుంటూరు, అమలాపురం, విజయవాడలోని వస్త్ర వ్యాపారులకు తమ ఉత్పత్తి నాణ్యతను వివరించి ఆర్డర్లు సంపాదించారు. ప్రస్తుతం 30 మంది మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి యూనిట్ చేరింది,

ఏడాదికి కోటి టర్నోవర్

కేవలం పది వేల పెట్టుబడితో ప్రారంభమైన యూనిట్ ప్రస్తుతం కోటి టర్నోవర్ సాధిస్తోంది, నగరంలోని సీఎంఆర్ సంస్థలు తమ జూట్ బ్యాగ్‌లు వినియోగించడంతో మంచి పేరు వచ్చిందని, ఈ దశలో గోపాలపట్నంలో మరో యూనిట్‌ను స్థాపించామని సరస్వతి తెలిపారు.

విస్తరించాలనేది ఆశ



జూట్‌బ్యాగ్‌ల తయారీ యూనిట్లు విస్తరించే ఆలోచన ఉంది. నిర్వహణకు ఆర్థికంగా ఆసరా అవసరం. ప్రభుత్వం చేయూతనిస్తే మరింతమంది మహిళలకు ఉపాధి కల్పిస్తా. పెందుర్తి ప్రాంతంలో 50 సెంట్ల స్థలం కేటాయించి, బ్యాంకు రుణం అందేలా చూస్తే యూనిట్ విస్తరించే వీలుంది. మల్టీ కలర్ మిషన్‌కే రూ.3 కోట్లు వెచ్చించాలి. ప్రస్తుతం సిబ్బంది జీతాలు, నిర్వహణ, ఇతర ఖర్చులు పోను నెలకు రూ.60వేలు ఆదాయం వస్తోంది.

\- వానా సరస్వతి, యూనిట్ స్థాపకురాలు

ఆదాయం బాగుంది



జూట్‌బ్యాగ్‌లుఅ తయారీ కేంద్రంలో చేరి శిక్షణ పొందడంతో ఆర్థికంగా స్థిరపడ్డాను. నెలకు రూ.10వేలు సంపాదిస్తున్నా.. నా భర్త ప్రైవేటు ఉద్యోగి. నా సంపాదన కుటుంబ అవసరాలకు పిల్లల చదువుకు ఉపయోగపడుతోంది. ఆర్డర్లు పెరిగితే ఆదాయం పెరుగుతోంది

\- సీహెచ్ కళ్యాణి, సాయినిరంజన్ కాలనీ, పెందుర్తి

క్లాత్ కట్టర్ వుమన్‌గా..



బ్యాగ్‌ల తయారీ కేంద్రంలో క్లాత్ కట్టర్ వుమన్ పనిచేస్తున్నా. నెలకు రూ.12వేలు సంపాదిస్తున్నా. వివిధ మోడల్స్, సైజ్‌లలో జూట్‌బ్యాగ్‌లు తయారీకి క్లాత్ కట్ చేస్తాను. ఈ నైపుణ్యంపైనే అందమైన బ్యాగ్‌లు తయారవుతాయి.

\- సీత, పెందుర్తి

ఆన్‌లైన్లో ఆర్డర్

బ్యాగుల తయారీకి అవసరమైన జనపనార, నెట్‌లైన్ రోలింగ్ క్లాత్‌లను ఆన్‌లైన్‌లో తెప్పిస్తున్నారు. అనంతరం స్క్రీన్ ప్రింటింగ్ చేస్తారు. ఈ మెటీరియల్‌ను కోలకత్తా, ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి ఆన్‌లైన్లో కొనుగోలు చేస్తున్నారు. మల్టీ కలర్ డిజైన్ బ్యాగ్‌లకు డిమాండ్ పెరగడంతో ఆ దిశగా సాగుతున్నారు.

రేపటి నుంచి పద్మనాభుని కల్యాణోత్సవాలు



పద్మనాభం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలోని అనంత పద్మనాభుని వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఈనెల 9 నుంచి 15 వరకు జరగనున్నాయి. ఇప్పటికే పెళ్లిరాట వేసి శ్రీకారం చుట్టారు. కుంతీమాధవస్వామి ఆలయ ప్రాంగణంలో 9న సాయంత్రం అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన చేస్తారు. 10న ధ్వజారోహణం, ఎదురు సన్నాహకం, కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 11న విశేష హోమం, గ్రామ బలిహరణ, మంగళాశాసనం, గ్రామోత్సవం, 12న విశేష హోమం, తెప్పోత్సవం జరుపుతారు. 13న విశేష హోమం, గ్రామ బలిహరణ, మంగళాశాసనం, వైదిక సదస్యం, ప్రత్యేక హోమాలు చేశాక స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. 14న డోలా మండపానికి స్వామివారు వేంచేయుట, పూర్ణాహుతి, అవబృధం, చక్రస్నానం, మంగళాశాసనం, గ్రామ బలిహరణ, ధ్వజావరోహణం, ధూపోత్సవాన్ని చేపడతారు. 15న వినోదోత్సవం, ద్వాదశ సేవ, ప్రదక్షిణ అనంతరం శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా చందనోత్సవం

- సింహాచలం దేవస్థానం ఈవోకు భీమిలి ఎమ్మెల్యే గంటా సూచన

సింహాచలం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం చందనోత్సవాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సింహాచం ఈఓ కె.సుబ్బారావుకు సూచించారు. చందనోత్సవాన్ని సవాలుగా తీసుకుని జిల్లాకు చెందిన ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు తగ్గట్టుగా పంచగ్రామాల భూ వివాదం పరిష్కారానికి కావలసిన సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. ఈఓగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి ఎంపీ ఎం.శ్రీభరత్‌ను, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావులను సుబ్బారావు శుక్రవారం కలిసిన సందర్భంగా గంటా సూచనలు చేశారు. అనంతరం స్వామి వారి శాలువాతో ప్రజాప్రతినిధులను సత్కరించి జ్ఞాపికగా అప్పన్న ఫొటోను, ప్రసాదాలను ఏఈఓ ఎస్.ఆనందకుమార్‌తో కలిసి అందజేశారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్‌లకు స్వామివారి ఫొటోలు, ప్రసాదాన్ని అందజేస్తున్న ఈఓ, ఏఈఓ

సీనియారిటీ జాబితాలో తప్పులు సవరించాలి: యూటీఎఫ్



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న అనకాపల్లి యూటీఎఫ్ నేతలు

ఆరిలోవ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో అనేక తప్పులు దొర్లాయని, వాటిని తక్షణమే సవరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్‌కు శుక్రవారం యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ర్యాంకులు, రోస్టర్ మెరిట్ లిస్టులు ప్రకటించకపోవడంతోనే తప్పులు జరగాయని అనకాపల్లి జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, అధ్యక్షుడు వాత్సవాయి లక్ష్మి విమర్శించారు. 1994 నుంచి ఇప్పటివరకు జరిగిన డీఎస్సీల వారీగా ర్యాంకులు, రోస్టర్ కంమెరిట్ లిస్టులను డీఈవో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తప్పుల సవరణకు సంబంధించి ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేందుకు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. తప్పుల సవరణ కోసం ఆయా జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల నుంచి అధిక శ్రమతో నగరానికి రావాల్సి వస్తోందన్నారు. సీనియారిటీ డ్రాఫ్ట్ జాబితాలో తప్పులను సవరించేందుకు ఉమ్మడి జిల్లాల పరిధిలోని అందరు డీడీవోలకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలన్నారు. ఇటీవల జరిగిన మునిసిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్‌లో 70 శాతం కోటా పూర్తి కాని క్యాటగిరీలో కోటా నింపేందుకు వీలుగా కమిషనర్‌కు లేఖ రాయాలన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా డీఈవో వారికి హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ కార్యదర్శులు ఎస్.శేషు, కుమార్, వి.చైతన్య శీల, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో రక్త రుగ్మతల చికిత్సా కేంద్రం ప్రారంభం



చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మామెన్ చాందీ, చిత్రంలో మురళీకృష్ణ వూణ్ణ

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ హెల్త్‌సిటీలోని యూనిక్ హాస్పిటల్ ప్రాంగణంలో రక్త రుగ్మతల పరిశోధన, చికిత్స కేంద్రం ప్రారంభమయింది. ప్రముఖ హెమటాలజిస్ట్ పద్మశ్రీ ప్రొఫెసర్ మామెన్‌చాందీ ఈ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ వూణ్ణ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్, రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ కేంద్రం ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నిమ్స్ అంకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

వరుణ్ హాస్పిటాలిటీ పనులపై విచారణకు ఆదేశం

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలో బీచ్‌కు 150 మీటర్ల దూరాన స్టార్ హోటల్ నిర్మిస్తున్న వరుణ్ హాస్పిటలాటీ సంస్థ సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నదని వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసింది. నిబంధనలకు విరుద్ధంగా బోర్లు తవ్వి నీటిని వినియోగిస్తున్నారని పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావించింది. ఇలాంటి అంశాలపై జిల్లా స్థాయి కమిటీ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నందున, వెంటనే సమావేశమై, పరిశీలించి నివేదిక పంపాలని ఆదేశించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మల్కాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీ పెట్రో పార్కు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కాంట్రాక్టు సూపర్‌వైజర్ మృతి చెందాడు. బిహార్‌కు చెందిన ఆర్యన్ కుమార్ (25) పెట్రో పార్కులో కాంట్రాక్టు సూపర్‌వైజర్‌గా పని చేస్తూ మల్కాపురంలో ఉంటున్నారు. గురువారం రాత్రి పది గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా స్పీడ్ బ్రేకర్ వద్దకు వచ్చేసరికి వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే ఉన్న కార్మికులు మల్కాపురం పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ నిర్వహణ పనుల్లో అపశ్రుతి

- స్తంభంపై నుంచి పడి ఇద్దరికి గాయాలు

మల్కాపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నిర్వహణ పనులు చేస్తుండగా అపశ్రుతి చోటుచేసుకుంది. మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేసి సిబ్బంది పనులకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పిలకవానిపాలెం జంక్షన్‌లో ఇద్దరు సిబ్బంది వేర్వేరు స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో కార్మికులు ఇద్దరూ తీవ్ర విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనుంచి కిందపడిపోయారు. ఈ ఘటనలో ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అధికారులు వారిని వెంటనే చికిత్స నిమిత్తం సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి తరలించారు. సరఫరాను నిలిపివేసినా కరెంటు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి గల కారణాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దయాల్‌నగర్‌లో భూ దందాపై రెవెన్యూ కదలిక

- కొండపైకి ఆర్ఐ, వీఆర్వో, సీనియర్ అసిస్టెంట్‌లతో కూడిన బృందం

గాజువాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో సాగుతున్న భూదందాపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. శుక్రవారం ఆర్ఐ, వీఆర్వో, సీనియర్ అసిస్టెంట్‌లతో కూడిన బృందం కొండపైకి వెళ్లి పలు వురిని విచారించింది. ఎవరో చెప్పే మాయమాటలు నమ్మి ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేయవద్దని, అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు చేపడతామని హెచ్చరించింది. వైసీపీ ముఖ్య నేత కుమారుడిపై ఆరోపణలు వెల్లువెత్తుతుండడంతో ఆ దిశగా దర్యాప్తునకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు.



దయాల్‌నగర్ కొండపై విచారణ చేస్తున్న అధికారులు

కొండపై పలు అక్రమణలు తొలగింపు : పెదగంట్యాడ తహశీల్దార్

దయాల్‌నగర్ కొండపై విచారణ చేపట్టినట్టు పెదగంట్యాడ తహశీల్దార్ పి.అమల తెలిపారు. కొండపై ఇప్పటివరకూ సుమారు తొమ్మిది ఆక్రమణలను గుర్తించి తొలగించామన్నారు. సర్వే నంబర్ 43/1లో గల భూమి కొండ పోరంబోకని, అక్కడ నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు.

ఐటీ సెజ్‌పై డ్రోన్ నిఘా

సాగర్‌నగర్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): రుషికొండ ఐటీ సెజ్‌లో గల మూడు హిల్స్‌పై డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్టు నార్త్ ఏసీపీ అప్పలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రోన్ల నిఘాతో పాటు 24 గంటలూ పోలీస్ సిబ్బంది గస్తీ తిరిగేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఎవరైనా బహిరంగంగా మద్యం సేవించినా, బైక్ రేస్‌లు నిర్వహించినా, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐటీ సెజ్, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

